ప్రజాశక్తి
సోమవారం 27 మార్చి 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

నేడు సిఎం జగన్ కారుమంచి రాక

వరికూటి కోటమ్మకు నివాళులర్పించనున్న సిఎం

ప్రజాశక్తి-టంగుటూరు

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి సోమవారం టంగుటూరు మండలం కారుమంచి గ్రామానికి రానున్నారు. ముఖ్యమంత్రి పర్యటన గురించి అధికారులకు సమాచారం అందడంతో అందరూ హుటాహుటిన కారుమంచి గ్రామానికి చేరుకున్నారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వరికూటి అమృతపాణి, వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు తల్లి వరికూటి కోటమ్మ శనివారం మృతి చెందిన విషయం విదితమే. ఆమె మృతదేహాన్ని వరికూటి అశోక్‌బాబు స్వగ్రామైన టంగుటూరు మండలం కారుమంచి గ్రామానికి తరలించారు. సిపిఎం జగన్ మోహన్ రెడ్డి సోమవారం ఉదయం 10 గంటలకు కారుమంచి గ్రామానికి విచ్చేసి వరికూటి కోటమ్మ భౌతికాయానికి నివాళులర్పిస్తారు. కారుమంచి గ్రామానికి సిఎం వస్తున్న సమాచారం అందుకున్న అధికారుల బందం హుటాహుటిన కారుమంచి గ్రామంలోని పలు ప్రాంతాలలో హెలిపాడ్ స్థలాన్ని పరిశీలించారు. చివరకూ కారుమంచి జిల్లా పరిషత్ హై స్కూల్ గ్రౌండ్ ఆవరణలో హెలిపాడ్ స్థలాన్ని అధికారులు ఖరారు చేశారు. అందులో భాగంగా జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణను జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్‌పి మలిక గర్గ్, అడిషనల్ ఎస్‌పి కె. నాగేశ్వరరావు సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఆర్‌డిఒ విశ్వేశ్వరరావు, దిశా డిఎస్‌పి ఎ.పల్లంరాజు, కొండపి సిఐ మాతంగి శ్రీనివాసరావు, టంగుటూరు ఎస్ఐ షేక్ ఖాదర్ బాషా, తహశీల్దారు కె. చిరంజీవి పాల్గొన్నారు.

హెలిపాడ్ స్థలాన్ని పరిశీస్తున్న ఎస్‌పి మల్లిక గర్గ్

పెరుగుతున్న రాజకీయ వైరం

- అసెంబ్లీలో జిల్లా ఎమ్మెల్యేల ఘర్షణ..దాడులు
- నియోజకవర్గాల్లోనూ ప్రధానపార్టీల మధ్య పోరు
- ప్రజా సమస్యలు పక్కదారిపడుతున్న వైనం

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీల నడుమ సాగిన యుద్ధం..అసెంబ్లీలో జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య ఘర్షణ..ప్రతిపక్ష ఎమ్మెల్యేపై దాడి..ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్యేల క్రాస్ ఓటింగ్ లాంటి అంశాలు ఇపుడు ప్రధాన పార్టీల నడుమ రాజకీయ వైరాన్ని పెంచుతున్నాయి. అసెంబ్లీలో జరిగిన అవాంఛనీయ ఘటనలు జిల్లా రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. సోషల్ మీడియాలో విమర్శలు తారా స్థాయికి చేరాయి. వీటిపై కూడా ఇపుడు పాలకప్రతిపక్ష పార్టీల నడుమ మరింత అంతరాలను పెంచుతున్నాయి. నియోజకవర్గాల్లోనూ వీటి ప్రభావం పెరుగుతోంది. ఏ చిన్న ఘటన జరిగినా రాజకీయకోణంలోనే ఆలోచించి పెద్దవి అయ్యేలా పరిస్థితులు మారు తున్నాయి. రేపోమాపో ఎన్నికలు జరుగు తాయనే వాతావరణాన్ని తెస్తున్నారు.ఈ పరిణామాల నేపథ్యంలో జనం సమస్యలు పక్కదారి పడుతున్నాయి. అర్జీలకు ప్రాధాన్యత లేకుండా పోతోంది. ప్రజా సమస్యలు ఎక్కడా చర్చకు రాని పరిస్థితి కొనసాగుతోంది. అసెంబ్లీలో గళం విప్పడం ఎండమావిగా మారింది. జిల్లా సమస్యలు వదిలేసి రాజకీయకోణం లోనే ఆరోపణలు సంధించు కుంటున్నారు. ఇపుడు ఎమ్మెల్యేల మధ్య కూడా మాటామంతి లేకుండా పోయింది. అసెంబ్లీలో ఎన్నోడూ లేనటువంటి అవాంచనీయ ఘటనలు జరిగాయి.వాటిలో జిల్లా ఎమ్మెల్యేలు ఇద్దరు కీలకంగా ఉన్నారు. ఇవి కూడా ఇపుడు పార్టీల్లో ప్రధాన చర్చగా మారాయి. జీవో నంబరు1 రద్దుకోసం టిడిపి ఎమ్మెల్యేలు స్పీకర్ పోడియం వద్దకు వెళ్లిన సందర్భంలో కొండపి ఎమ్మెల్యే డాక్టర్ వీరాంజనేయస్వామిపై సంతనూతలపాడు ఎమ్మెల్యే సుధాకర్‌బాబు దాడిచేశారు. అక్కడ జరిగిన తోపులాటలో ఆయన కూడా కిందపడిపోయారు. చేతికి స్వల్పగాయం అయ్యింది. దీన్ని చూపి తనపైనా దాడిచేశారని ఆయన మీడియా ముందు ఆరోపించారు. అసలు పోడియం వద్ద ఉన్నది టిడిపి ఎమ్మెల్యేలు. జీవో నెంబరు 1రద్దు కోసం ఆందోళన చేస్తున్నారు.స్పీకర్ భద్రతకు భంగం కలిగే పరిస్థితి వస్తే ఆయనే మార్షల్స్‌ను పిలవాలి. వారు ఆయనకు రక్షణ కల్పిస్తారు. ఆ ప్రక్రియ జరగలేదు.వైసిపి ఎమ్మెల్యేలు వెళ్లి తెలుగుదేశం

▶ 2లో

చలో ఢిల్లీని జయప్రదం చేయండి

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు పిలుపు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా, ఉద్యోగ, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా కమిటీ సమావేశం యూనియన్ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు అధ్యక్షతన సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.45లక్షల కోట్ల బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు పెద్ద ఎత్తున కోతలు పెట్టారని విమర్శించారు. ఉపాధిహామీ పథకం అమలుకు గతంలో కంటే బాగా నిధులు తగ్గించారని తెలిపారు. ఐసిడిఎస్‌కు నిధుల కోత పెట్టారన్నారు. ప్రభుత్వ రంగంలోని పలు సంస్థలను అమ్మడం ద్వారా రూ.80వేల కోట్ల నిధులు సమీకరించాలని బడ్జెట్‌లో ప్రతిపాదించడం దుర్మార్గమన్నారు. దీనివల్ల భవిష్యత్తులో ప్రభుత్వ రంగాలు నిర్వీర్యం అయ్యే పరిస్థితి ఉంటుందన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత అనేక ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆస్తులను కారుచౌకగా అమ్మేయడమే పనిగా మోడీ పాలన కొనసాగుతోందన్నారు. అదానీ అక్రమ ఆస్తులపై హిడెన్ బర్గ్ సంస్థ బయటపెట్టిన విషయాలలో నిజాలు నిగ్గుతేల్చడం లేదన్నారు. అదానీ అక్రమ ఆస్తులపై పార్లమెంటరీ కమిటీ వేయాలని ప్రతిపక్షాలన్నీ ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. పార్లమెంట్ సజావుగా సాగనీయకుండా రాహుల్ గాంధీని టార్గెట్ చేస్తూ ఆటంకాలు కలిగిస్తోందన్నారు. ప్రతిపక్షాలను టార్గెట్ చేస్తూ ఈడీ, సిబిఐ లాంటి సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి విధానాలను రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే ఇక్కడ వారు మౌనం దాల్చుతూ కొన్ని సందర్భాలలో మద్దతు తెలుపుతూ రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక చర్యలకు నిరసనగా సిఐటియు, రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక

▶ 2లో



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు

చట్టాలు.. ఇఒ చుట్టాలా..?

- టిటిడి ఇఒ చర్యల పట్ల ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు ఆగ్రహం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంబాబు

ప్రజాశక్తి - గిద్దలూరు

తిరుమల తిరుపతి దేవస్థానం ఇఒ ఒంటెద్దు పోకడలపై ఎమ్మెల్యే అన్నా రాంబాబు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న అనంతరం మీడియాతో అన్నా వెంకట రాంబాబు ఆదివారం మాట్లాడారు. స్వామి వారి దర్శనం, సౌకర్యాల కల్పన, ప్రొటోకాల్ విషయంలో ఇఒ దుర్వినియోగం చేస్తూ ఒంటెత్తు పోకడతో తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూన్నారన్నారు. టిటిడికి, ప్రభుత్వ పెద్దలకు చెడ్డ పేరు తెచ్చేందుకు ఈ పని చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నా రాంబాబు టిటిడి ఇఒ ధర్మారెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. సామాన్య భక్తులకు సౌకర్యాలు చేపడున్నామనే వంకతో ప్రొటోకాల్ విషయంలో తన ఇష్టారాజ్యంగా వ్యవహరించడమేమిటని ఎమ్మెల్యే ప్రశ్నించారు. సామాన్య భక్తులకు ప్రాధాన్యత కల్పించడాన్ని తాము స్వాగతిస్తామన్నారు. తిరుమలలో అన్ని విషయాలు పారదర్శకంగా జరిగితే తాను సంతోషిస్తామని తెలిపారు. అయితే అలా జరగటం లేదన్నారు. ప్రొటోకాల్, దర్శనాలు, సౌకర్యాల విషయంలో ఇఒ తన వారిని ఒక రకంగా, ఇతరులను ఇంకో రకంగా చూస్తున్నట్లు తెలిపారు. ఇది వివక్ష కాదా..? అని ఆయన ప్రశ్నించారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి జారీ చేసిన సిఫారసు లేఖను జనరల్ కేటగిరీగా చూడటం ఏమిటని ఆయన ప్రశ్నించారు. తన ఎదుట ప్రోటోకాల్ లో ఉన్నవారి వాహనాలను వదిలేసి, అదే ప్రోటోకాల్‌లో ఉన్న తమ వాహనాలను ఆపి సోదా చేయడం ఏమిటని ఆయని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిటిడి ఇఒ ఒంటెత్తు పోకడ, ఆయన వైఖరిపై ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్తానని అన్నా వెంకటరాంబాబు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఎంతో ప్రజాదరణ ఉందన్నారు. ఇఒ లాంటి అధికారుల చేష్టల వల్ల తమ ప్రభుత్వానికి, తమ ముఖ్యమంత్రికి చెడ్డపేరు వస్తుందన్నారు. టిటిడి ఇఒ ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని ఆయన హితువు పలికారు.

పిడుగు పాటుకు 38 జీవాలు మృతి

విలపిస్తున్న పశు పోషకులు

ప్రజాశక్తి-పొదిలి

మండలంలోని సూదనగుంట గ్రామంలో ఆదివారం పిడుగుపాటుకు 38 మేకలు, గొర్రెలు, పొట్టేళ్లు, మేకపోతులు మృతి చెందిన సంఘటన గ్రామంలో విషాదం నింపింది. గ్రామానికి చెందిన పశువుల కాపరులు రెడ్డిబోయిన లక్ష్మయ్య, మొర్రె ఆదినారాయణ, రెడ్డిబోయిన చిన్న వెంకటసుబ్బయ్య, పాలకంటి చినగురవయ్య, కాకర్ల సుబ్బారావులకు చెందిన మూగజీవాలను ఉమ్మడిగా ఈటుపోయిన పొలాల్లో మేతకు తీసుకువెళ్లారు. సాయంత్రం వాతావరణం మారి ఒక్కసారిగా ఉరుములు, పిడుగులతో దద్దరిల్లింది. ఈ సందర్భంగా సమీపంలోని చెట్టు కిందకు చేరుకున్న మూగజీవాలపై పిడుగు పడటంతో 38 గొర్రెలు, పొట్టేళ్లు, మేకలు, మేకపోతులు అక్కడికక్కడే మృతి చెందాయి. సూదనగుంట గ్రామం నుంచి కుంచేపల్లి గ్రామానికి వెళ్లే పొలాలలో ఈ సంఘటన జరిగింది. మృతి చెందిన జీవాల విలువ సుమారు నాలుగున్నర లక్షల నుంచి ఐదు లక్షల వరకు ఉంటుందని బాధిత పోషకులు వాపోతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని పోషకులు కోరుతున్నారు.

పిడుగుపాటుకు మృతి చెందిన జీవాల వద్ద పశుపోషకులు

పెరుగుతున్న రాజకీయ వైరం

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలను అడ్డుకునే వ్యవహారంలో ఘర్షణలు, తోపులాటలు కొట్టుకోవడాలు జరిగాయి. ఈ పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. తప్పు ఎవరిదో స్పష్టం. ఎందుకు జరిగిందో తెలియని అంశం కాదు. జిల్లాలో ఎన్నడూలేని సంస్కృతి వచ్చింది. గత రెండు మూడు దశాబ్దాలుగా చూస్తే జిల్లా ఎమ్మెల్యేలు ఏనాడూ ఇలా ప్రవర్తించలేదు. అసెంబ్లీలో ఒకరిపై ఒకరు దాడిచేసిన సందర్భాలు లేవనే చెప్పాలి. ఇపుడు చోటు చేసుకుంది. ఈ ఘటన జిల్లా ఎమ్మెల్యేల నడుమ కూడా మరింత దూరం పెంచింది. పార్టీలకు అతీతంగా జిల్లా సమస్యలపై పోరాడాలనే ఆలోచన కూడా పోయింది. జిల్లా సమస్యలపై ఎవరిదారి వారిదే అన్నట్లుగా మారింది. దీని వల్ల జనం నష్టపోతారని గుర్తించడం లేదు. పాలకపక్షం సంయమనం పాటించాలి. దూకుడుగా వ్యవహరించడం భావ్యం కాదనే చర్చ కూడా ముందుకొచ్చింది. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగాయి. నలుగురు వైసిపి ఎమ్మెల్యేలు తెలుగుదేశం అభ్యర్థికి ఓటేశారు. ఇపుడు ఆ నలుగురిని సస్పెండ్ చేశారు. ఈ పరిణామాలపైనా సోషల్‌మీడియాలో పోస్టులు చూస్తుంటే రెండు పార్టీల కార్యకర్తల నడుమ గ్రామాల్లో మరింత ఉద్రిక్తతలను పెంచేలా కనిపిస్తున్నాయి. రాజకీయ వాతావరం మరింత వేడెక్కుతోంది. వాటిపై ఫిర్యాదులు చేసుకుంటున్నారు. కౌంటర్లు పెడుతున్నారు. దళిత ఎమ్మెల్యేలు. దళిత మహిళ అనే అంశంపై ఇపుడు సోషల్ మీడియాలో చర్చ తీవ్రమైంది. సామాజిక అంశంపైనా చర్చ తీవ్రంగానే సాగుతోంది. మనిషి వ్యక్తిగత గౌరవాలకు భంగం కలిగించేలా పోస్టులు పెడుతున్నారు. ఇవన్నీ వ్యక్తిగత జీవితాలపైనా ప్రభావం చూపుతున్నాయి. కార్యకర్తల మధ్య మరింత ఉద్రిక్తతలు, ఘర్షణ వాతావరణాన్ని పెంచేలా ఉన్నాయి. వీటికి కారణం ప్రధానపార్టీలు వ్యవహరించే రాజకీయ పంథాలే. అధికారం కోసమే అన్నట్లుగా అన్ని పరిణామాలు జరుగుతున్నాయి. రెండు వారాల్లోనే రాజకీయ పరిణామాల్లో వేగం పెరిగింది. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు టిడిపి కార్యకర్తల్లో జోష్‌ను పెంచాయనే విశ్లేషణలున్నాయి. పాలకపక్షంలో ఊహించిన ఫలితాలు అంతర్మథనం చెందేలా చేశాయి. పాలకపక్ష నేతలు ఇపుడు ఆలోచనలోనూ పడ్డారు. రాజకీయ సమీకరణల్లో మార్పులు దిశగా పరిణామాలున్నాయనే చర్చ సాగుతోంది. ప్రభుత్వంపై వ్యతిరేకత ఏ స్థాయిలో ఉందనే చర్చ వారిలో సాగుతోంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీర్పు ఇపుడు పార్టీల దిశాదశను మార్చిందనే చర్చ సాగుతోంది. ఎన్నికల్లో వ్యవహరించిన అనైతిక పద్ధతులు కూడా ఎన్నికల తీరును మార్చేశాయి. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు జనం కోసం పనిచేస్తుంటే ఈసారి డబ్బుతో వారిని ఓడించారు. అక్కడా రాజకీయపార్టీలు అడుగుపెట్టాయి. ఇక్కడా గెలుపు ఆధిపత్యం కోసం అన్ని అడ్డదారులు తొక్కారు. క్షేత్రస్థాయిలో రెండు పార్టీల నడుమ మోహరింపు తీవ్రంగా కనిపించింది. ఇవన్నీ రానున్నకాలంలో పార్టీల నడుమ అధికారం కోసం సాగే పోరుపైనా ప్రభావం చూపనున్నాయి. ప్రజాస్వామ్యంలో రాజకీయపార్టీల పాత్ర అనే విషయం ఇక్కడ పూర్తిగా పక్కదారిపట్టింది. అధికారం కోసం ఏమైనా చేయాలనే తలంపు వస్తుంది. ఇపుడు ఇదే ధోరణి కనిపిస్తోంది. ఇది మంచిసాంప్రదాయం కాదని గుర్తించాల్సిన అవసరం ఉంది. మన పాలన తీరుపైనే ప్రజల తీర్పు ఉంటుందనే విషయం పార్టీలు, వాటి తరుపున పోటీచేసే అభ్యర్థులు గుర్తుపెట్టుకోవాలి.

మద్యం మత్తులో వ్యక్తిపై దాడి

ప్రజాశక్తి-మద్దిపాడు: మద్యం మత్తులో ఒక వ్యక్తిపై దాడి చేసిన ఘటన ఏడుగుండ్లపాడులో చోటు ఆదివారం చేసుకుంది. ఎస్ఐ టి శ్రీరామ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వెంకయ్య, కోటయ్య ఇరువురూ తాపీ పనికి ఒంగోలు వెళ్లి తిరిగి వస్తూ మద్యం తెచ్చుకున్నారు. ఇద్దరు మద్యం సేవించారు. అనంతరం వెంకయ్య తన భార్యతో గొడవ పడి ఆమెను కొడుతుండగా, నా చెల్లెలిని ఎందుకు కొడుతున్నావని కట్టెలు నరికే మొద్దు కత్తితో తల వెనుక వైపు కొట్టాడు. దీంతో అతడికి రక్త గాయాలు అయ్యాయి. క్షతగాత్రుడిని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

వికలాంగుడికి చారిటీ బాక్స్ చేయూత

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

వికలాంగుడికి సాయమందిస్తున్న దృశ్యం

పోలియో మూలంగా రెండు కాళ్లూ చచ్చుబడి పోయిన వికలాంగుడికి ఛారిటీబ్యాక్స్ స్వచ్ఛంద సంస్థ చేయూత అందించింది. మండల పరిధిలోని చిమ్మిరిబండ గ్రామానికి చెందిన హుస్సేన్ చిన్నతనం నుంచి పోలియో మూలంగా జీవనోపాధి కోల్పోయి గ్రామంలోనే ద్విచక్ర వాహనాలకు పంచర్లు వేసుకుని వచ్చే కొద్దిపాటి మొత్తంతో పడుతున్న ఇబ్బందులను గుర్తించిన ఛారిటీ బాక్స్ ప్రతినిధులు తామున్నామంటూ ముందుకు వచ్చారు. పంచర్లు వేయడానికి అవసరమైన ఎయిర్ ఫిల్లింగ్ మిషన్‌ని తమ స్వచ్ఛంద సంస్థ తరపున ఆదివారం చిమ్మిరిబండ గ్రామంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధి రావినూతల యోహాను మాట్లాడుతూ సేవే లక్ష్యంగా చారిటి బాక్స్ తరపున రాష్ట్రవ్యాప్తంగా సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దుడ్డు రవిప్రసాద్, జంబయ్య, నాగేశ్వరరావు, బొప్పూడి అనిల్ కుమార్, తేళ్ల రామారావు, శ్రీదేవి కోటా, వివేక్ శిల్లా, వెంకట శివ ప్రసాద్ పాల్గొన్నారు.

చలో ఢిల్లీని జయప్రదం చేయండి

(మొటిపేజీ తరువాయి)

సంఘం ఆధ్వర్యంలో ఛలో ఢిల్లీ చేపట్టాలని పిలుపు నిచ్చినట్లు తెలిపారు. ఆరోజు ఢిల్లీలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్ కార్యకలాపాలను ప్రవేశపెట్టారు. జిల్లాలో పరిశ్రమలు మూతపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్మిక చట్టాలు అమలు కాకపోయినా పట్టించుకోవడం లేదన్నారు. చలో ఢిల్లీ కార్యక్రమం ఉద్దేశాన్ని ప్రజలకు వివరిస్తూ జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా కరపత్ర ప్రచారం నిర్వహించ‌నున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్లు జివి.కొండారెడ్డి, జి.శ్రీనివాసులు, పి. కల్పన, ఈ.అన్నపూర్ణ, పి.ఆంజనేయులు, టి.మహేష్, బంకా సుబ్బారావు, కేశవరావు, రంగారావు, చిరంజీవి, రాఘవమ్మ, జివి.రాఘయ్య, రూబేన్, మాల్యాద్రి, సిఐటియు జిల్లా అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దళితులపై దాడులను అరికట్టాలి

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

దళితులపై దాడులు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సమతా సైనిక దళ్ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల చిట్టిబాబు డిమాండ్ చేశారు. కాకినాడ జిల్లా తొండంగి మండలం శృంగవక్షం గ్రామం ఎస్సీ యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం సమతా సైనిక దళ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా స్థానిక రామ్ నగర్-నేతాజీ నగర్ కాలనీల వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి పెద్దఖానా వద్దకు ర్యాలీగా చేరుకొని నిందితుల దిష్టి బొమ్మలు దహనం చేశారు. నాయకులు దగ్గుమల్లి శ్రీకర్, గోశాల సుధాకర్, బొల్లాపల్లి బెన్నీ బాబు, సాతులూరి ఉదయభాస్కర్, కల్లూరి రాజశేఖర్, పోపూరి రాజు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.A.No.260/2018

E.P.No. /2023

1. **షేక్. మహబూబ్ బాషా** (Died)
& వగైరా ... పిటిషనర్లు / D.H.Rs

వర్సెస్

1. **షేక్. జిలాని బాషా** (Died)
& మరి ఒకరు ... రెస్పాండెంట్స్ / JDRs

టు,
షేక్.దిల్‌షాద్, భర్త లేట్ **షేక్.జిలాని బాషా,**
డోర్ నెంబర్.9-266, సాయిబాబా స్ట్రీట్,
కొత్తపేట, కనిగిరి టౌన్ & నగర పంచాయతీ,
ప్రకాశం జిల్లా.

పై నెంబర్ పిటీషన్‌లో మీరు ప్రతివాది అయిన మీరు పై కోర్టు నుండి అనేక సార్లు పిటీషన్ నోటీసులు పంపినను మీరు తీసుకోనందున శ్రీ కోర్టు వారు ఈ నోటీసును పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియజేయమని ఉత్తర్వులు వేసి, పై నెంబర్ పిటీషన్‌ను **తేది: 29-03-2023** కి వాయిదా వేసియున్నారు. కావున ఆదినము **ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లేక మీ వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున విచారించి తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేదీ: 29-03-2023

ఇట్లు
చిడిపోతు హరికృష్ణ
న్యాయవాది, కందుకూరు

మహారాజశ్రీ కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.A.No.261/2018

E.P.No. /2023

1. **షేక్. మహబూబ్ బాషా** (Died)
& వగైరా ... పిటిషనర్లు / D.H.Rs

వర్సెస్

1. **షేక్. జిలాని బాషా** (Died)
& మరి ఒకరు ... రెస్పాండెంట్స్ / JDRs

టు,
షేక్.దిల్‌షాద్, భర్త లేట్ **షేక్.జిలాని బాషా,**
డోర్ నెంబర్.9-266, సాయిబాబా స్ట్రీట్,
కొత్తపేట, కనిగిరి టౌన్ & నగర పంచాయతీ,
ప్రకాశం జిల్లా.

పై నెంబర్ పిటీషన్‌లో మీరు ప్రతివాది అయిన మీరు పై కోర్టు నుండి అనేక సార్లు పిటీషన్ నోటీసులు పంపినను మీరు తీసుకోనందున శ్రీ కోర్టు వారు ఈ నోటీసును పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియజేయమని ఉత్తర్వులు వేసి, పై నెంబర్ పిటీషన్‌ను **తేది: 29-03-2023** కి వాయిదా వేసియున్నారు. కావున ఆదినము **ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లేక మీ వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున విచారించి తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేదీ: 29-03-2023

ఇట్లు
చిడిపోతు హరికృష్ణ
న్యాయవాది, కందుకూరు

గ్రామ పంచాయతీ కార్యాలయం - సురేపల్లి గ్రామం

భట్టిప్రోలు మండలం, బాపట్ల జిల్లా

టెండరు ప్రకటన **ది: 26-3-2023**

బాపట్ల జిల్లా, భట్టిప్రోలు మండలం, సురేపల్లి గ్రామ పంచాయతీకి ఈ దిగువ షెడ్యూల్డ్ దాఖలా 2023-24 సంవత్సరమునకు సంబంధించి టెండరు పద్ధతి పై అవసరమైన సామగ్రిని, సిబ్బంది పని చేయుటకు సీల్డ్ టెండర్లు కొరబడుచున్నవి. ఆసక్తి గల వారు తగిన ధరవతు చెల్లించి సీల్డ్ వేసిన టెండర్లు దాఖలు చేయవలెను. తేది: 28.03.2023 న ఉదయం 11.00 గంటలకు స్వీకరించబడి అదే రోజు మధ్యాహ్నం 1 గంటలకు హాజరైన టెండర్ దార్ల సమక్షంలో తెరవబడును. ధరవతు చెల్లించనివి స్వీకరించబడవు. టెండర్లు నిలిపి వేయుట లేదా రద్దు చేయుటకు కార్యదర్శి వారికి అధికారము కలదు.

షెడ్యూల్డ్

వ.నెం	పనివివరము	ధరవతు
1.	2023-24 కు టెండరు పద్ధతిపై పని చేయుట మోటార్ ఆపరేటర్ - 1	100
2.	2023-24 కు టెండరు పద్ధతి పై పని చేయుట నైట్ వాచర్ కం స్వీపర్ -1	100
3.	2023-24 కు టెండరు పద్ధతి పై పని చెయుట ఎలాక్ట్రిషియన్ - 1	100
4.	పి హెచ్ సి సామాన్లు, పి డబ్ల్యూ ఎస్ సామాన్లు, పంపు సామాన్లు సరఫరా చేయుట -1	100 చొప్పున

స్థలం: సురేపల్లి
తేది: 26-3-2023

సం// టి అనురాధ
పంచాయతీ కార్యదర్శి
సురేపల్లి, భట్టిప్రోలు మండలం, బాపట్ల జిల్లా.

గ్రామ పంచాయతీ కార్యాలయం - కోనేటిపురం గ్రామం

భట్టిప్రోలు మండలం, బాపట్ల జిల్లా

టెండరు ప్రకటన **ది: 26-3-2023**

బాపట్ల జిల్లా, భట్టిప్రోలు మండలం, కోనేటిపురం గ్రామ పంచాయతీకి ఈ దిగువ షెడ్యూల్డ్ దాఖలా 2023-24 సంవత్సరమునకు సంబంధించి టెండరు పద్ధతి పై అవసరమైన సామగ్రిని, సిబ్బంది పని చేయుటకు సీల్డ్ టెండర్లు కొరబడుచున్నవి. ఆసక్తి గల వారు తగిన ధరవతు చెల్లించి సీల్డ్ వేసిన టెండర్లు దాఖలు చేయవలెను. తేది: 28.03.2023 న మధ్యాహ్నం 02.00 గంటలకు స్వీకరించబడి అదే రోజు సాయంత్రం 3 గంటలకు హాజరైన టెండర్ దార్ల సమక్షంలో తెరవబడును. ధరవతు చెల్లించనివి స్వీకరించబడవు. టెండర్లు నిలిపి వేయుట లేదా రద్దు చేయుటకు కార్యదర్శి వారికి అధికారము కలదు.

షెడ్యూల్డ్

వ.నెం	పనివివరము	ధరవతు
1.	2023-24 కు టెండరు పద్ధతిపై పని చేయుట మోటార్ ఆపరేటర్ - 1	100
2.	2023-24 కు టెండరు పద్ధతి పై పని చేయుట నైట్ వాచర్ కం స్వీపర్ -1	100
3.	2023-24 కు టెండరు పద్ధతి పై పని చెయుట ఎలాక్ట్రిషియన్ - 1	100
4.	పి హెచ్ సి సామాన్లు, పి డబ్ల్యూ ఎస్ సామాన్లు, పంపు సామాన్లు సరఫరా చేయుట -1	100 చొప్పున

స్థలం: కోనేటిపురం
తేది: 26-3-2023

సం// టి అనురాధ
పంచాయతీ కార్యదర్శి
కోనేటిపురం, భట్టిప్రోలు మండలం, బాపట్ల జిల్లా.

దుర్గంధంతో ప్రజల బెంబేలు

మురుగు నీరు పారుదల లేక ఇక్కట్లు

ప్రజాశక్తి-చెరుకుపల్లి

చెరుకుపల్లిలో మురుగునీరు పారుదల లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. జాతీయ రహదారి విస్తరణ పుణ్యమా అని చెరుకుపల్లిలో రోడ్ల విస్తరణ పనులు ఇప్పటికీ చేపట్టకపోవడంతో డ్రైనేజీలు సక్రమంగా లేక మురుగునీరు రోడ్లపైనే ఉంటోంది. ముఖ్యంగా చెరుకుపల్లి సంపత్‌బాబు కాలనీ, పోలీస్ స్టేషన్, సంత బజారు, ఖాదర్‌ఖాన్ సెంటర్, ఇతర ప్రధాన రహదారులపై మురుగునీరు పారుదల జరుగుతూ ప్రయాణికులకు నరకం చూపిస్తోంది. రోజుల తరబడి నీరు నిలవడంతో మురుగునీరు పచ్చగా మారి దుర్గంధం వెదజల్లుతోంది. ఇదేవిధంగా డ్రైనేజీ కొనసాగితే అంటువ్యాధులు వ్యాప్తి చెందుతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోడ్ల విస్తరణ పేరుతో జాతీయ రహదారి నిర్మాణ సంస్థ రోజులు గడుపుతూ ప్రయాణికులకు చుక్కలు చూపిస్తోంది. గుంటలు పడిన రోడ్లను పూడ్చక, డ్రైనేజీ వ్యవస్థను అస్తవ్యస్తం చేయడంతో గ్రామస్తులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. అదేవిధంగా పంచాయతీ సిబ్బంది సైతం కూలీల కొరతతో పనులు చేయలేక నెమ్మదిగా పనులు చేయడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా మురుగునీటిని తొలగించి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

చెరుకుపల్లిలో మురుగునీరు రోడ్లపై నిలబడి పాకుడు పట్టిన దృశ్యం

చెరుకుపల్లి సంపత్‌బాబు కాలనీలో రోడ్లపై పారుతున్న మురుగునీరు

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల మండలం మూలపాలెం గ్రామానికి చెందిన బెజ్జం అప్పారావు(50) బాపట్ల బేతనీ కాలనీ రైల్వే పట్టాల వద్ద అనుమానాస్పద స్థితిలో మృతిచెంది పడిఉన్నట్లు రైల్వే పోలీసులు గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. వివరాలు అందాల్సి ఉంది. అనుమానాస్పద స్థితిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-అద్దంకి

ద్విచక్ర వాహనం టీవీఎస్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో మహిళతోపాటుగా, మరో యువకునికి తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం పట్టణ సమీపంలోని రాజీవ్ కాలనీ పెట్రోల్ బంకు సమీపంలో జరిగింది. రాజీవ్ గాంధీకి చెందిన కే మస్తాన్ వలి పట్టణంలో పని చూసుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో పట్టణంలోని బలిజపాలేనికి చెందిన కే కాంచనకు తీవ్ర గాయాలు కాగా మెరుగైన వైద్యం కోసం ఒంగోలు ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.

మరో ప్రమాదం

బల్లికురవ మండలం చెన్నుపల్లి గ్రామానికి చెందిన తంగిలాల గోపి వ్యక్తిగత పనుల నిమిత్తం అద్దంకి వస్తున్న సమయంలో మూల మలుపు వద్ద ఓ బైక్ ఢీకొన్న సంఘటనలో గోపికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కి సమాచారం అందించగా క్షతగాత్రున్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

కోడి పందేల జూదరుల అరెస్ట్

ప్రజాశక్తి-రేపల్లె

కోడి పందేలు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విజయచంద్ర హెచ్చరించారు. మండలంలోని రుద్రవరం గ్రామ పొలాలలో కోడి పందేలు వేస్తున్న పది మంది జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. గ్రామాల్లో జూద క్రీడలను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. కోడి పందేలు వేస్తున్న వారి వద్ద నుంచి పదకొండు కోళ్ళు, రూ.7,150 నగదు, 22 బైకులు స్వాధీనపరచుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఒంగోలు ఎస్పీ మల్లికాగర్గ్, జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరావు ఆదేశాల మేరకు, మార్కాపురం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎ శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో యర్రగొండపాలెం ఎస్‌ఈబి స్టేషన్ పరిధిలో త్రిపురాంతకం మండలంలో ఆదివారం విస్తృత దాడులు నిర్వహించారు. నాటుసారా తయారు చేసి విక్రయిస్తున్న కేశినేనిపల్లికి చెందిన మేంద్రగుత్తి ఆదిలక్ష్మి, లేళ్లపల్లి గ్రామానికి చెందిన అలుగుసాని పుల్లయ్య, దువ్వలి గ్రామానికి చెందిన మేంద్రగుత్తి తిరుపతయ్య అనే ముగ్గురు నిందితులను అరెస్టు చేసి 7 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. నాటు సారా తయారు చేసేందుకు ఉపయోగించు 50 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 10 కేజీల బెల్లంను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో టీం మార్కాపురం కానిస్టేబుల్స్ బాల రంగయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రితో విద్యార్థులు

పరీక్షా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని నిడమానూరు కూనం రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వపు విద్యార్థులు 1993-94 బ్యాచ్ వారు పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 68మంది విద్యార్థులకు పరీక్షలకు సంబంధించిన పరీక్ష సామగ్రిని ఆదివారం పంపిణీ చేశారు. ఒక్కొక్క విద్యార్థికి రైటింగ్ పాడ్, పెన్నులు, పెన్సిల్లు, షార్ప్‌నర్, రబ్బరు, స్కేలు మొదలగు వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నన్నెబోయిన వెంకటశివకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగుతూ నలుగురికి సహాయపడే విధంగా విద్యను అభ్యసించాలని సూచించారు. వడ్డిముక్కల రాజ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఈదర దేవసేన గారు మాట్లాడుతూ విద్యార్థులు దాతల సహాయాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదిగి సమాజంలో ఉన్నత పౌరులుగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో యెడ్లూరి యల్లమంద, పైడి నాగేశ్వరరావు, మొగిలిచర్ల ప్రసాదు, పాఠశాల ఉపాధ్యాయులు చలపతిరావు, వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి-కొత్తపట్నం

కొత్తపట్నం మండలం పాదర్తి గ్రామంలో ఆదివారం ఉదయం నుంచి కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరంపై కొత్తపట్నం ఎస్ఐ కొక్కిళ్లగడ్డ మధు సూదన్ తన బృందంతో దాడి చేసి 13 మందిని అరెస్టు చేశారు. 18 కోళ్లను పట్టుకున్నట్లు తెలియజేశారు. వారి వద్ద నుంచి 12,590 రూపాయల నగదు, కొన్ని మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కోళ్లను ఒంగోలు కస్టడీ ఆఫీసుకు తరలించినట్లు ఆయన తెలియజేశారు. కోడి పందేలు నిర్వహిస్తున్న వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఆయన తెలిపారు. గత పది రోజుల నుంచి ఆది వారం 26వ తేదీన కోడిపందేలు నిర్వహించాలనే విషయం కొత్తపట్నం గ్రామంలో హాట్ టాపిక్‌గా మారింది. దానిని గమనించి నివారించడంలో పోలీస్ వ్యవస్థ విఫలం చెందిందని దీనినిబట్టి అర్థమవుతోంది. కోడి పందేల సందర్భంగా లక్షల రూపాయలు చేతులు మారినట్లు గ్రామంలో చర్చ నడుస్తోంది. సుమారుగా మూడు జిల్లాల నుంచి ఈ కోడి పందేలకు వచ్చినట్లు సమాచారం. ఒంగోలు వన్ టౌన్ సిఐ టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కోడి పందేల స్థావరంపై దాడి చేశారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

ప్రజాశక్తి-మద్దిపాడు

మద్దిపాడు గ్రామానికి చెందిన ఇరువురు మహిళలు బసవన్నపాలెం పోయే రహదారి వైపు వాకింగ్ నిమిత్తం వెళ్లి వస్తుండగా, సుమారు, 35 సంవత్సరాల వయస్సు గల యువకుడు ముందు శ్రీదేవిని అడ్డగించి నీ మెడలో చైన్ ఇవ్వమని అడుగగా ఆమె అతనికి చిక్కకుండా పరుగెత్తింది. మరో మహిళ సత్యవతిని బెదిరించి మెడలో ఉన్న 3 సవర్ల బంగారు చైన్ తెంచుకొని పొలాల్లోకి పరుగెత్తి పోయాడు. ఎంత వెతికినా కన్పించలేదని, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ శ్రీరామ్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆదాయం కొంచెం.. దాతృత్వం ఘనం

తన కొద్దిపాటి ఆదాయంలో పేదల ఆకలి తీరుస్తున్న సర్వర్ శంకర్

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

అతడు దినసరి కూలితో జీవనం సాగించే వ్యక్తి. అనాథ వృద్ధులకు ఆశ్రయం కల్పించాడు. గత మూడు సంవత్సరాలుగా ఎంతోమందికి అన్నదానం చేస్తూ వారి ఆకలి తీరుస్తున్నాడు. తాను కూడబెట్టుకున్న రూ.18 వేల నగదును ఆశ్రమానికి విరాళంగా ఇచ్చి ఎందరికో ఆదర్శంగా నిలిచాడు. మార్టూరులోని నాగరాజుపల్లి సెంటర్‌లోని ఆదిత్య హొటల్‌లో శంకర్ సర్వర్‌గా పనిచేస్తున్నాడు. మార్టూరులో అమ్మ ఆశ్రమం ద్వారా అనాథ వృద్ధులకు అందుతున్న సేవలను తన యజమాని ద్వారా తెలుసుకున్న శంకర్ శనివారం ఆశ్రమ నిర్వాహకులు గుంటుపల్లి చందుకి తన రెండు నెలల జీతం విరాళంగా అందజేశాడు. ఈ నగదును నూతనంగా నిర్మిస్తున్న ఆశ్రమ నిర్మాణం కోసం వినియోగించాలని శంకర్ కోరారు. హొటల్‌లో సర్వర్‌గా పనిచేస్తూ.. అనాథలకు చేయూత ఇస్తున్న అమ్మ ఆశ్రమానికి విరాళం అందజేయడం పట్ల మార్టూరులో పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు గుంటుపల్లి చందు మాట్లాడుతూ.. మార్టూరులో గత మూడు సంవత్సరాలుగా తాత్కాలిక భవనంలో చాలీచాలని వసతులతో ఎవరూ లేని అనాథలకు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, నేడు ఆశ్రమానికి శాశ్వత భవనం నిర్మాణం జరుగుతున్నవేళ చిరు ఉద్యోగి అయిన శంకర్ తన రెండు నెలల జీతం రూ.18 వేలు నగదు విరాళంగా ఇచ్చి తన దాతృత్వాన్ని చాటుకోవడం అభినందనీయమని అన్నారు.

ఆశ్రమ నిర్వాహకుడికి విరాళం అందిస్తున్న శంకర్

కుమార్తె, మనువరాలు అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-చీరాల

కుమార్తె, మనువరాలు అదృశ్యంపై ఫిర్యాదు అందడంతో ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని కావూరివారిపాలెం పంచా తులసీనగర్ గ్రామానికి చెందిన కుమార్తె మరియు మనవరాలు శుక్రవారం ఉదయం నుండి కనిపించక పోవడంతో తండ్రి చుట్టుపక్కల మరియు బంధువుల వద్ద వెదికాడు. అయినా వారి జాడ అందకపోవడంతో శనివారం రాత్రి ఈపూరుపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రథమ చైర్మన్ కాంస్య విగ్రహం ఏర్పాటుకు ఎమ్మెల్యే హామీ

ప్రజాశక్తి-చీరాల

చీరాల మున్సిపాలిటీలో ప్రథమ చైర్మన్ అన్నదాత నాగేంద్రుడు కాంశ్య విగ్రహాన్ని చీరాల మున్సిపాలిటీ ఆవరణలో ఏర్పాటు చేయించవలసినదిగా కోరుతూ ఆదివారం నియోజకవర్గ శాసన సభ్యులు కరణం బలరామకష్ణమూర్తి గౌరవ పూర్వకముగా కలసి చైర్మన్ జంజనం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రిప్రజెంటేషన్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అన్నదాత నాగేంద్రుడు మనవడు అన్నదాత లక్ష్మీ నరసింహారావు, అన్నదాత పాండురంగారావు, అన్నదాత రమేష్, మాజీ కౌన్సిలర్ గోలి జ్ఞానప్రసాద్, సీనియర్ నాయకులు గోలి గిరి కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బలరాంకు అర్జీ ఇస్తున్న దృశ్యం

వైద్య శిబిరంలో పాల్గొన్న ఆరోగ్య సిబ్బంది

ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-రేపల్లె

ఉచిత వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ విజయ సారథి అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హ్యాపీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ విజయ సారథి మాట్లాడుతూ తీర ప్రాంత ప్రజల సౌకర్యార్థం ఈ క్యాంపును ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. రెడ్ క్రాస్ సంస్థ బాపట్ల జిల్లా చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య మాట్లాడుతూ ఉచిత మెగా వైద్య శిబిరంలో బిపి, షుగర్, ఆయాసం, చెవి, ముక్కు, గొంతు సమస్యలకు, క్యాన్సర్ సమస్యలకు, ఎముకలకు సంబంధించిన సమస్యలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం 108 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. క్యాంపులో ప్రముఖ వైద్యులు ఉప్పలపు నారాయణస్వామి, ఉప్పలపు పావని ప్రియాంక, మహేష్ కిరణ్, అరుణ్ తేజ్ పెనుమాక, వినీల్ తెలికి, బివి గురునాథశర్మ, ఎం శ్వేత, కిషన్‌బాబు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెనాలి సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ కార్యదర్శి భానుమతి, సభ్యులు అడుసుమల్లి ప్రభాకర్‌రావు, సయ్యద్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధలు అనుసరణీయం

ప్రజాశక్తి-సంతమాగులూరు: క్రీస్తు బోధలు అనుసరణీయమని రాష్ట్ర శాప్ నెట్ కార్పొరేషన్ చైర్మన్, వైసిపి అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య అన్నారు. ఆదివారం మండలంలోని గురిజేపల్లి గ్రామంలో, సీయోను అపోస్తలిక్ మినిస్ట్రీస్ 24వ వార్షికోత్సవ కూటముల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యేసుక్రీస్తు యొక్క గొప్పతనాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ పి అబ్రహాం, పి ఇస్సాకు, జడ్పిటిసి అడవి శ్రీనివాసరావు, వైసీపీ మండల కన్వీనర్ చింతా రామారావు, సర్పంచి గుంటి పెద్దబ్బాయి, మాజీ సర్పంచి దమ్ము శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సాయం అందజేస్తున్న దృశ్యం

రూ.25 వేల ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-సంతమాగులూరు: మండలంలోని కొప్పరం గ్రామంలో ఆదివారం జనసేన పార్టీ నాయకుడు కొప్పరపు విజయ్ కుమార్ కుటుంబానికి ఆదివారం మండలంలోని జనసైనికులు అందరూ కలసి రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కాగా జన సైనికుడు విజయ్ కుమార్ ఇటీవల పక్షవాతానికి గురికాగా, అతని తండ్రి రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయాడు. దీంతో వారి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతోంది. ఇది గమనించిన తోటి జనసైనికులు తమ సహాయాన్ని అందజేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి చెల్లా వెంకట కృష్ణారావు మాట్లాడుతూ భవిష్యత్తులో జనసైనికుల కుటుంబాలకు ఎలాం టి ఇబ్బందులు ఉన్నా, జనసేన పార్టీ వారి కుటుంబానికి అండ గా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జన సైనికులు సాధు వెంకటేష్, జి రామాంజి, గూడూరి మల్లేశ్వరరావు, వడ్లమాను నాగార్జున, జి వెంకటేష్, అప్పారావు, అడపాల శ్రీను, కే వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రాణాలు హరిస్తున్న కాలుష్యం

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

సుమారు పది గ్రామాలకు పైగా తాగునీరు సరఫరా చేసే కాలువ నిరంతరం కలుషితంగానే పారుతూ ఉంటుంది. దీనికి గాను చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకునిరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలోని కృష్ణ పశ్చిమ బ్యాంక్ కెనాల్ నుంచి గుంటూరు జిల్లా లంకెవానిదిబ్బ పరిసర గ్రామాలు, కృష్ణా జిల్లా నాగాయలంక మండలం ఎదురుమొండి, జింకపాలెం, నాచుగుంట, గొల్లమంద, కమ్మవారిపాలెం, క్రీస్తుపురం తదితర గ్రామాలకు ఈ కెనాల్ నుంచే తాగునీరు వెళుతుంది. అక్కడ ఉన్న పెద్ద పెద్ద చెరువులకు నీటిని నింపుకొని వేసవి దాహార్తిని తీరుస్తుంటారు. సముద్రం ఒడ్డున ఉన్న ఈ గ్రామాలకు కెనాల్ నీరు తప్ప వేరేమార్గం లేదు. గుంటూరు జిల్లా రేపల్లె మండలం రాజు కాల్వ వద్ద కృష్ణా నదిలో తూములు ఏర్పాటు చేసి కెనాల్ నీటిని చెరువులకు నింపుతారు. అలాంటి ప్రాధాన్యత కలిగిన బ్యాంక్ కెనాల్ వెల్లటూరు వంతెనపై నిరంతరం చేపల విక్రయాలు నిర్వహించటం, వాటిని శుభ్రపర్చిన వ్యర్థాలను కాలువలోనే వదులుతుంటారు. దీనివలన వేలాదిమందికి తాగునీరుగా ఉన్న కాలువ కలుషితం అవుతోందని, వెల్లటూరు వంతెనపై చేపల విక్రయాలు, వ్యర్థాలను అరికట్టాలని దిగువ గ్రామాల ప్రజలు విన్నవించినా పట్టించుకోవటం లేదని వాపోతున్నారు.

పాత వంతెనపై చేపల శుభ్రం కేంద్రం

చర్యలకు బదులుగా వసూళ్లు

దిగువ గ్రామాలకు తాగునీటిని అందించే బ్యాంక్ కెనాల్ కలుషితమవుతున్నా చర్యలు తీసుకోవాల్సిన వెల్లటూరు పంచాయతీ అధికారులు విక్రయదారుల నుంచి పన్నులు వసూలు చేయడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదే రీతిలో సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు సైతం విక్రయదారులను బెదిరించి అక్రమ వసూళ్లు చేస్తున్నారని, దీని కారణంగానే వ్యాపారస్తులు యథేచ్ఛగా చేపల విక్రయాలు, వ్యర్థాలు చేపడుతున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. దీనిని నివారించేందుకు గత పాలకవర్గంలో సర్పంచ్ చీకటి భుజంగరావు పెదపులివర్రు రోడ్డు మార్గంలో ఉన్న ఖాళీ స్థలాన్ని శుభ్రపర్చి చేపల మార్కెట్‌కు వినియోగించుకునే విధంగా ఏర్పాటు చేశారు. ఎన్నికలు సమీపించి పాలకవర్గం మారటంతో పాటు బాధ్యతలు చేపట్టిన కార్యదర్శి కూడా హెూటళ్లు, దుకాణాలు, చేపల వ్యాపారస్తుల నుంచి మామూళ్లు వసూలు చేస్తున్నారే కానీ ప్రజారోగ్యం గురించి పట్టించుకోవటం లేదని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సరఫరా జరిగే కెనాల్ వంతెనపై చేపల వ్యర్థాలు, విక్రయాలు నివారించి నీరు కలుషితం కాకుండా చూడాలని దిగువ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వెల్లటూరు వంతెనపై చేపల మార్కెట్

ఖోఖో క్రీడాకారుడికి ఎమ్మెల్యే అభినందనలు

ప్రజాశక్తి-బాపట్ల

క్రీడాకారుడిని అభినందిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

రాష్ట్రంలో క్రీడాకారులను మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్రీడా రంగానికి పెద్ద పీట వేస్తుందని బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి పేర్కొన్నారు. అస్సాం రాష్ట్ర రాజధాని గౌహతిలో ఈ నెల 24న జరిగిన 4వ ఏషియన్ అంతర్జాతీయ ఖోఖో టోర్నమెంట్లో స్వర్ణ పతకం సాధించిన ఆట్ల శివనాగిరెడ్డిని కోన ప్రశంసించారు. బాపట్ల జిల్లా జె పంగులూరు క్రీడాకారుడు శివ నాగిరెడ్డిని ఆదివారం ఎమ్మెల్యే కోన రఘుపతి స్వగృహంలో సన్మానించారు. ఈ సందర్భంగా కోన మాట్లాడుతూ జె పంగులూరు గ్రామంలోని ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ నుంచి ఎంతో మంది అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎంపికై ఉన్నత ఉద్యోగాలు సాధించటం అభినందనీయమని అన్నారు. బాపట్ల నియోజకర్గానికి చెందిన శివనాగిరెడ్డి ఏషియన్లో బంగారు పతకం సాధించి బాపట్ల ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయడం ఎంతో గొప్ప విషయమని అన్నారు. శివనాగిరెడ్డికి ప్రభుత్వపరంగా సాయం అందించేందుకు కృషి చేస్తామని కోన హామీ ఇచ్చారు. క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్న ఖోఖో అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు, రాష్ట్ర కార్యదర్శి సీతారామిరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ మహిళా జిల్లా అధ్యక్షులు వై అశ్వనీరెడ్డి ఉన్నారు.

వర్షంతో మొక్కజొన్న రైతుకు అపార నష్టం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

వర్షాలకు ఎండిపోయిన మొక్కజొన్న పైరు

గత పది రోజుల క్రితం కురిసిన వర్షం కొందరు రైతులకు ఊరట కలిగించగా మరి కొందరికి అపార నష్టాన్ని కలిగించింది. డెల్టా ప్రాంతంలో ఈ ఏడాది అధిక శాతం మొక్కజొన్న, జొన్న పంటలను సాగు చేశారు. జొన్న కంకి దశలో ఉండగా మొక్కజొన్న కండె దశలో ఉంది. సాధారణంగా నవంబర్ నెల నుంచి జనవరి నెలాఖరు వరకు మొక్కజొన్న పంటను సాగు చేస్తుంటారు. నవంబర్, డిసెంబర్ నెలలో సాగు చేసిన పైరు కండె దశలో ఉంది. గింజ పలుపోసుకునే స్థాయిలో ఉంది. అదే రీతిలో జనవరి నెలలో సాగుచేసిన పైరు కండె ఏర్పడే దశకు చేరుకున్న సమయంలో కురిసిన వర్షానికి తేమ శాతం అధికమై తట్టుకోలేక పైరు చనిపోయిందని రైతులు వాపోతున్నారు. భట్టిప్రోలు మండలంలో అద్దేపల్లి, ఐలవరం, కోనేటిపురం, రాచూరు, పల్లెకోన గ్రామాలలో లేత దశలో ఉన్న పైరు వర్షానికి గురై నిలువునా ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎకరాకు దాదాపు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు చేశామని, చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావటం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సుమారు వెయ్యి ఎకరాలకు పైగా ఈ విధంగా దెబ్బతిన్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి దెబ్బతిన్న పంటను పరిశీలించి ఆదుకోవాలని కోరుతున్నారు.

పేదల ఆరోగ్యాన్ని కాపాడటమే లక్ష్యం

డాక్టర్ మంచాల రమేష్ ● గంగవరంలో ఉచిత రెగ్యులర్ మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి-పంగులూరు

వైద్యం ఖరీదు అయిపోతున్న ఈ రోజుల్లో, పేదవాడి ఆరోగ్యం గురించి పట్టించుకునేవారు లేరని, పేదవారి ఆరోగ్యాన్ని కాపాడటమే లక్ష్యంగా చేసుకొని, గంగవరం ఆరోగ్య, సంక్షేమ వేదిక పనిచేస్తుందని, ప్రముఖ వైద్యులు డాక్టర్ మంచాల రమేష్ అన్నారు. ఇంకొల్లు మండలం గంగవరం గ్రామంలో, రెండు నెలలకు ఒకసారి గంగవరం ఆరోగ్య సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న ఉచిత రెగ్యులర్ మెడికల్ క్యాంపు ఆదివారం జరిగింది. మంచాల వెంకటరామయ్య, రంగమ్మ కళ్యాణ వేదికలో ఈ మెడికల్ క్యాంపు జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ, గత నాలుగేళ్లుగా ఉచిత రెగ్యులర్ మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని, ఈ క్యాంపునకు దాతల సహకారం ఎంతో ఉందని అన్నారు. పేదలకు తక్కువ ఖర్చుతో, మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నామని, పేదలంతా ఈ మెడికల్ క్యాంపును ఉపయోగించుకోవాలని అన్నారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం మాజీ కార్యదర్శి వై సిద్దయ్య మాట్లాడుతూ, గంగవరం ఆరోగ్య, సంక్షేమ వేదిక ద్వారా ఈ ప్రాంత ప్రజలు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఈ వేదిక సేవలను విస్తృతం చేసి, మరింతమంది ప్రజలకు సేవ చేయాలని అన్నారు. కరి సత్యనారాయణరావు మాస్టారు స్మారకార్థం, ఆయన భార్య సక్కుబాయి, కుటుంబ సభ్యులు గోపికృష్ణ, అజయ్ కుమార్, డాక్టర్ జీవన జ్యోతి, ఈ మెడికల్ క్యాంపునకు ఆర్థిక సహకారం అందజేశారు. క్యాంపులో డాక్టర్ మంచాల రమేష్‌తో పాటు, పంగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ మల్లికార్జునరావు, డాక్టర్ కొత్త రాజేంద్ర రోగులను పరీక్షించి, వైద్య సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ అన్నవరపు సాంబయ్య ప్రారంభించగా, మందుల పంపిణీలో ఎం వెంకటరావు, ఎం అరుణ, కే బాలచందర్, ఉపాధ్యాయుడు టి శ్రీనివాసరావు, రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, ఉపాధ్యాయులు ఏ సుబ్బారావు పాల్గొన్నారు.

గంగవరం మెడికల్ క్యాంపులో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పంచాయతీ అధికారులపై వేటు

- ముగ్గురిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి -శింగరాయకొండ

శింగరాయకొండ గ్రామ పంచాయతీ అధికారులపై వేటు పడింది సాక్షాత్ జిల్లా కలెక్టర్ రంగంలోకి దిగి అధికారులను సస్పెండ్ చేశారు. శింగరాయకొండ గ్రామపంచాయతీలో నిధులు దుర్వినియోగంపై ప్రజాశక్తిలో కథనాలు ప్రచురితమైయ్యాయి. గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు జిల్లా కలెక్టర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ప్రజాశక్తి దినపత్రిక ప్రచురితమైన విచారణ సరే.. చర్యలేవీ ? అనే కథనం గురించి కలెక్టర్ వివరించారు. దీంతో స్పందించిన కలెక్టర్ కలెక్టర్ పంచాయతీ కార్యదర్శి శరత్ బాబు, జూనియర్ అసిస్టెంట్ శైలజ, కంప్యూటర్ ఆపరేటర్ సురేష్‌ను సస్పెండ్ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు ఇచ్చారు. పంచాయతీ నిధుల దుర్వినియోగంపై వార్డు సభ్యులు ఒలేటి రవిశంకర్ రెడ్డి, పాదర్తి కోటేశ్వరరావు, మేకల నరేష్, దావులూరి ఆదామ్ , పడిదపు రవికుమార్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్‌ను కలిసి గ్రామ పంచాయతీని కాపాడాలని వినతి పత్రం అందజేశారు.

ప్రజాశక్తి కథనానికి స్పందన

విచారణ సరే..చర్యలేవీ..?

- శింగరాయకొండ పంచాయతీలో అవినీతిపై తేలని చర్యలు

ప్రజాశక్తి -శింగరాయకొండ

శింగరాయకొండ గ్రామపంచాయతీలో చోటు చేసుకున్న అవినీతి అక్రమాలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. కలెక్టర్ స్పందించి అవినీతిపై విచారణ జరిపించి నివేదికను తెప్పించుకున్నారు. అయినప్పటికీ ఎలాంటి చర్యలు లేక పోవడం శింగరాయకొండలో చర్చగా మారింది. శింగరాయకొండ పంచాయతీ పరిధిలోని బాలాజీ నగర్‌కు చెందిన బి.అశోక్ అనే వ్యక్తి అవినీతిపై జిల్లా కలెక్టర్‌కు గత ఫిబ్రవరిలో స్పందనలో ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి నిధులు దుర్వినియోగం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కలెక్టర్ జిల్లా పంచాయతీ అధికారిని విచారణ జరిపించాలని ఆదేశించారు. డిపిఒ ఒంగోలు డివిజనల్ పంచాయతీ అధికారి పద్మను విచారణ అధికారిగా నియమించారు. పంచాయతీ కార్యదర్శి శరత్ బాబు, జూనియర్ అసిస్టెంట్ శైలజ, కంప్యూటర్ ఆపరేటర్ సురేష్‌ను విచారించారు. అదేవిధంగా ఇఒఆర్‌డి అంజలీదేవిని కూడా విచారించారు. గ్రామపంచాయతీ నిధుల డ్రా గురించి అడిగి తెలుసుకున్నారు. నిధులు డ్రా చేసే సమయంలో స్టాక్ రిజిస్టర్, క్యాష్ బుక్‌లో ఎంట్రీలు సరిగా లేకపోవడాన్ని అధికారులు గుర్తించారు. గతంలో పనిచేసిన అధికారుల పేరుతో రూ. 13,91, 071

పంచాయతీ కార్యాలయం ఇదే

ఎలాంటి స్టాక్, పంచాయతీ తీర్మానం లేకుండా పంచాయతీ కార్యదర్శి శరత్ బాబు, సర్పంచ్ తాటిపర్తి వనజా సిఎఫ్ఎంఎస్ డ్రా చేసినట్లుగా డిఎల్‌పిఒ పద్మ తమ నివేదికలో వెల్లడించారు. మరికొంత నగదుకు సంబంధించి ఎలాంటి రికార్డులు లేవని విచారణ సమయంలో అధికారులు చూపించలేదని నివేదికలో పేర్కొన్నారు. గతంలో పనిచేసిన కార్యదర్శి రామ్మోహన్ రూ. 4.444 వేల రూపాయలకు సామాగ్రి కొన్నట్లు నిధులు డ్రా చేశారని, కార్యదర్శి రామ్మోహన్ మాత్రం సామగ్రి కొనలేదని రాతపూర్వకంగా ఇచ్చినట్లు నివేదికలో పేర్కొన్నారు. ఇఒఆర్‌డి అంజలీదేవి ఇన్‌ఛార్జి కార్యదర్శిగా పనిచేసిన సమయంలో రూ. 5,67,281 సామగ్రి కొనుగోలు చేసినట్లు తెలిపారు. విచారణ సమయంలో ఇఒఆర్‌డి అంజలీదేవి తాను ఇన్‌ఛార్జి కార్యదర్శిగా పనిచేసిన సమయంలో ఎలాంటి సామగ్రి కొనుగోలు చేయలేదని రాతపూర్వకంగా తెలియజేశారు. ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి రూ.84, 000 వేలు డ్రా చేసి ఉండగా దానికి సంబంధించి కూడా రికార్డులు చూపించలేదని తెలిసింది. డిఎల్‌పిఒ విచారణకు వచ్చిన సమయంలో పంచాయతీకి సంబంధించిన డబ్బులు డ్రా చేసిన రసీదులు తప్ప, అందుకు సంబంధించిన రికార్డులు అందుబాటులో లేవు. ఈమేరకు ఒంగోలు డిఎల్‌పిఒ పద్మ జిల్లా పంచాయతీ అధికారి నారాయణరెడ్డికి నివేదిక సమర్పించారు. పంచాయతీ కార్యదర్శి శరత్ బాబు, జూనియర్ అసిస్టెంట్ శైలజ, కంప్యూటర్ ఆపరేటర్ సురేష్ అవినీతి కారకులని వారిపై పంచాయతీరాజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేశారు. ఈ నివేదికను ఈనెల 15న జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరింది. చర్యలు ఎప్పుడోనని చర్చించుకుంటున్నారు.

వారం రోజుల్లో చర్యలు : ఎంపిడిఒ

ఎంపిడిఒ షేక్ జమీఉల్లా మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఇఒఆర్‌డి అంజలీదేవితో సమావేశం నిర్వహించారు. పంచాయతీలో చోటు చేసుకున్న పరిణామాలపై స్పష్టమైన నివేదిక ఇవ్వాలని తెలిపారు. తూతూ మంత్రం నివేదికలు ఇస్తే ఇలాగే కాలం గడిచిపోతుందని, పూర్తిస్థాయి నివేదిక అందజేయాలన్నారు. నివేదికను బట్టి తాను జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా కలెక్టర్ పంపి గ్రామపంచాయతీలో జరుగుతున్న విషయాల గురించి చర్చిస్తామన్నారు. నివేదికపై వారం రోజులో చర్యలు తీసుకునేలా చూస్తామని ఆయన తెలిపారు.

ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనం

వాటర్ ఫౌంటైన్లను ప్రారంభిస్తున్న మేయర్

అహ్లాదకరంగా పార్కులు : మేయర్

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరంలోని పార్కులను అహ్లాద కరంగా తీర్చిదిద్దుతున్నట్లు నగర మేయర్ గంగాడ సుజాత తెలిపారు. రూ.6 లక్షల వ్యయంతో స్థానిక 37వ డివిజన్ ఎన్‌టిఆర్ పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు హైమ్యాస్క్ లైట్‌లు, వాటర్ ఫౌంటైన్‌లను ఆదివారం రాత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని అన్నీ పార్కులలో మౌళిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. పిల్లలకు అవసరమైన ఆటవస్తువులు అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వర రావు, స్థానిక కార్పొరేటర్ చెన్నుపాటి వేణుగోపాల్, కార్పొరేషన్ ఇంజినీర్ కె మాల్యాద్రి, డిఇఇ పద్మజా తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

రూ.లక్ష విరాళం అందజేత

ప్రజాశక్తి-దర్శి

దర్శి మండలం యర్రఓబనపల్లి గ్రామంలోని శివాలయం అభివృద్ధికి ఎమ్మెల్యే డాక్టరు మద్దిశెట్టి వేణుగోపాల్ లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. గ్రామ సర్పంచి కైపు సుబ్బారెడ్డికి ఆదివారం విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టరు కుమ్మిత అంజిరెడ్డి, గ్రామ నాయకులు బి.రమణారెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

అరవింద్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరంలోని పవర్ ఆఫీసు ఎదురు లైన్ ఎన్‌జిఒ కాలనీ మెయిన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన అరవింద్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఆదివారం ప్రారంభించారు. లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ఐఎఎస్ అధికారి డాక్టర్ ఎన్. జయప్రకాష్ నారాయణ్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఒంగోలు నగరంలో ఇంటర్వెన్షనల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, పల్మనాలజీ సేవలు, అత్యాధునిక, అత్యుత్తమ పరికరాలతో మొట్టమొదటి ఆపరేషన్ థియేటర్ తమ వైద్యశాలలో అందుబాటులో ఉన్నట్లు హాస్పిటల్ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మందలపు నరేంద్రబాబు, డాక్టర్ ఎన్.భాను తేజ, ప్రముఖ వైద్యులు డాక్టర్ మందలపు వెంకట్రావు పాల్గొన్నారు.

హాస్పిటల్ ప్రారంభోత్సవంలో జయప్రకాష్ నారాయణ్

నేడు స్పందన కార్యక్రమం రద్దు

ప్రజాశక్తి -ఒంగోలు క్రైం

ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం నేడు రద్దు చేసినట్లు ఎస్‌పి మల్లికగర్గ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారు తమ ప్రయాణాన్ని రద్దు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

ఎంపీ మాగుంటకు సత్కారం

ప్రజాశక్తి - ఒంగోలు క్రైం

ఉగాది పర్వ దినాన్ని పురస్కరించుకుని శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవాసమితి కార్యవర్గం ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని శాలువా, జ్ఞాపికతో ఆదివాంర సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా మన సాంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా ఉగాది కవితా మహోత్సవాలు నిర్వహిస్తున్న శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవాసమితి కార్యవర్గాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో సమితి నాయకులు కుర్రా ప్రసాద్, జి.ఓబుల్‌రెడ్డి, ఎస్.కోటేశ్వరరావు, ఎం.దేవప్రసాద్, ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

1251 మందికి వైద్యపరీక్షలు

దర్శి : స్థానిక పిజిఎన్ కాంప్లెక్స్ కల్యాణ మండపం వద్ద రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యభిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని డిఎస్‌పి నారాయణస్వామిరెడ్డి ప్రారంభించారు. గుంటూరు శంకర్ కంటి వైద్యశాల, ఒంగోలులోని వివిధ వైద్యశాలకు చెందిన వైద్యనిపుణులు 1251 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరానికి వచ్చిన వారికి భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, కార్యదర్శి రెడ్డిమాసు శ్రీనివాసరావు, కోశాధికారి కర్నా రమణారెడ్డి, వైద్యులు డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ కోటిరెడ్డి, డాక్టర్ ఎస్ఎం.బాషా, కర్నా వెంకటేశ్వరరెడ్డి, రాహుల్, రమాలక్ష్మి, మహేంద్రరెడ్డి, నాగమణి, ఝాన్సీ, రమణారెడ్డి పాల్గొన్నారు.

వరికూటి కోటమ్మకు ఘన నివాళి

ప్రజాశక్తి -శింగరాయకొండ

వైసిపి రాష్ట్ర నాయకుడు డాక్టర్ వరికూటి అమతపాణి, వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు తల్లి వరికూటి కోటమ్మ శనివారం మతి చెందిన తెలిసిన విషయమే. ప్రముఖల సందర్శనార్థం ఒంగోలు ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ డీలర్ వరికూటి వెంకటరమణారావు నివాసంలో కోటమ్మ మృతదేహాన్ని ఉంచారు. బాపట్ల జిల్లా చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకష్ణమూర్తి, సంత నూతలపాడు ఎమ్మెల్యే టిజెఆర్. సుధాకర్ బాబు తదితరులు కోటమ్మ మతదేహాన్ని ఆదివారం సందర్శించి నివాళులర్పించారు. అదేవిధంగా ప్రకాశం, బాపట్ల జిల్లాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు కోటమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కోటమ్మ అంత్యక్రియలు టంగుటూరు మండలం కారుమంచి గ్రామంలో సోమవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నివాళుర్పిస్తున్న చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబు

అంత్యక్రియల్లో పాల్గొన్న పోలీసు సిబ్బంది

కృష్ణారెడ్డికి అంత్యక్రియలు

ప్రజాశక్తి- కంభం రూరల్

జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ కృష్ణారెడ్డి శుక్రవారం అనారోగ్యంతో మతి చెందారు. ఆయన మృతదేహానికి స్వగ్రామం రావిపాడు ఆయన పోలీస్ లాంఛనాలతో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. మట్టిఖర్చుల నిమిత్తం కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులకు రూ.30,000 నగదును కంభం నాగ మల్లేశ్వర రావు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వెంకారెడ్డి యూత్ ఆధ్వర్యంలో ప్రభ ఏర్పాటు

పజాశక్తి-చీమకుర్తి

రామతీర్థం గంగ తిరునాళ్ల వచ్చేనెల 5న నిర్వహించనున్నారు. అందులో భాగంగా మారంవెంకారెడ్డి యూత్ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభను ఏర్పాటు చేస్తున్నట్లు యూత్ నాయకులు తెలిపారు. మద్దిపాడు ఎఎంసి మాజీ ఛైర్మన్ మారం వెంకారెడ్డి నివాసం వద్ద నుంచి రామతీర్థం మోక్ష రామలింగేశ్వర స్వామి దేవస్థానం వరకూ మారం వెంకారెడ్డి యూత్ ఆధ్వర్యంలో వైసిపి విద్యుత్ ప్రభ ఏర్పాటుకు ఆదివారం భారీ ర్యాలీగా తరలివెళ్ళారు. రామతీర్థం దేవాలయంలో మారం వెంకారెడ్డి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం విద్యుత్ ప్రభ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మారం వెంకారెడ్డి మాట్లాడుతూ ఏప్రిల్ 5న రామతీర్థం తిరునాళ్ల సందర్భంగా విద్యుత్ ప్రభను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.వైసిపి అభిమానులు, కార్యకర్తలు ప్రజలు విశేషంగా పాల్గొని జయప్రదం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచి మారం వెంకటేశ్వరరెడ్డి, మారం వెంకారెడ్డి యూత్ నాయకులు కోట రాములు,సిహెచ్. నాగిరెడ్డి, పల్లకి సురేష్‌రెడ్డి, మేడగం బ్రహ్మారెడ్డి, బడే దశరధరామిరెడ్డి, నారాయణ చిరంజీవి, చుంచు శ్రీను, మరియదాసు, శింగారెడ్డి, అశోక్, దోమల పుల్లయ్య,కడవ రామకృష్ణ,బండారు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభ ఏర్పాటును ప్రారంభిస్తున్న మారం వెంకారెడ్డి

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబు

ప్రజాశక్తి -ఒంగోలు క్రైం

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్.బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో డివైఎఫ్ఐ జిల్లా కమిటి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు కెవి.పిచ్చయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కెఎఫ్.బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో 45 వేలకు పైగా టీచర్‌పోస్టులు, సచివాలయంలో ఎనిమిది వేలు మొత్తం కలిపి 2.43 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఓట్ల కోసం నిరుద్యోగులను మభ్యపెట్టెందుకు జాబ్‌క్యాలండర్ విడుదల చేస్తాంని హామీ ఇచ్చినట్లు తెలిపారు. నాలుగు సంవత్సరాలుగా జాబ్ క్యాలండర్ గురించి పోయినట్లు ఎద్దేవ చేశారు. ఉద్యోగాల భర్తీ కోసం జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు, పోరాటలు నిర్వహించాలని తీర్మానించినట్లు ఆయన తెలిపారు. వేసవిలో తాగు నీటి కోరత లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

కేక్ కట్ చేసిన టిడిపి నాయకులు

కేట్ కట్ చేసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - జగుగుమల్లి

టిడిపి యువ నాయకులు నారా లోకేష్ చేపట్టిన యువగళం పాద యాత్ర ఆదివారం నాటికి 50 రోజులు పూర్తయి సందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి మండల కన్వీనరు పోకూరి రవీంద్రబాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం మిఠాయిలు పంచారు. అదేవిధంగా మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్ర మోహనరెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు ఎనిమిరెడ్డి రమేష్‌రెడ్డి, తెలుగు రైతు మాజీ అధ్యక్షుడు దగ్గుమాటి సుబ్బారెడ్డి , టిడిపి మండల ప్రధాన కార్యదర్శి నరాల సోమయ్య, టిడిపి నాయకులు కట్టా మణికుమార్, కొండూరి బలరామిరెడ్డి పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత

ప్రజాశక్తి-త్రిపురాంతకం

వాసవీ క్లబ్స్ వారి ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు పరీక్ష సామగ్రి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ చైర్మన్ గుడిపాటి మధుసూదనరావు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి తమ తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూలు ప్రధానోపాధ్యాయుడు టి. రాజశేఖర్ రెడ్డి , వాసవీ క్లబ్ సెక్రెటరీ పవన్ కుమార్, ఐపిసి ఆఫీసర్ కొండూరి హనుమంతరావు , వాసవీ క్లబ్ అధ్యక్షుడు గుడిపాటి చెన్నకేశవులు, ఉపాధ్యక్షుడు సముద్రాల సుధాకర్ బాబు, వాసవీ యూత్ క్లబ్ ప్రెసిడెంట్ సోమశేఖర్, ఉపాధ్యక్షుడు అయ్యప్ప పవన్ , అన్నా సాయి, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

110 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - జరుగుమల్లి

జరుగుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒంగోలు కిమ్స్ వైద్య శాల వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా షుగరు, బిపి పరీక్షలు 110 మందికి, కంటి పరీక్షలు 45 మందికి నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ వైద్యశాల వైద్యులు డాక్టర్ రామాంజనేయులు, డాక్టర్ విజయలక్ష్మి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాడివారిపల్లి ఎస్ఐగా సుధాకర్

ప్రజాశక్తి-తర్లుపాడు

తర్లుపాడు మండలం తాడివారిపల్లి పోలీస్ స్టేషన్‌గా ఎస్ఐగా వేముల సుధాకర్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న పి.ముక్కంటి గుంటూరుకు బదిలీపై వెళ్లారు.

సమాజ సేవలో ముందుండాలి

ప్రజాశక్తి-మార్కాపురం

కుల, మతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా సమాజ సేవలో ముందు పీఠాన నిలవాలనే సంకల్పంతో మానవతా స్వచ్ఛంధ సంస్థను స్థాపించినట్లు ఆ సంస్థ అధ్యక్షురాలు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యురాలు గుంటక వనజాక్షి చెన్నారెడ్డి తెలిపారు.స్థానిక జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలలో సంస్థ సభ్యులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిర్వహిస్తున్న మానవతా స్వచ్ఛంధ సంస్థ అభివృద్ధి కోసం అందరం కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా పేదలకు ఆకలి బాధలు తీర్చేందుకు కృషి చేస్తున్న శ్రీసాయి నిత్య అన్నదాన సమితి సభ్యులు చెన్నయ్య సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి నారాయణం లావణ్య, కోశాధికారి ఊటుకూరి భాగ్యలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పాదయాత్ర

ప్రజాశక్తి-మార్కాపురం

పశ్చిమ ప్రకాశం ప్రజల సమస్యల పరిష్కారం కోసం టిడిపి మార్కాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మరోసారి పాదయాత్రికుడిగా ప్రజల వద్దకు బయలు దేరాడు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని, మార్కాపురం ప్రత్యేక జిల్లాగా గుర్తించాలని 'ప్రజా చైతన్య యాత్ర' పేరుతో పాదయాత్ర చేపట్టారు. పాదయాత్ర ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి, తద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి చేసి వెలిగొండ ప్రాజెక్టుతో పాటు మార్కాపురం జిల్లా సాధించాలనేది 'కందుల' సంకల్పం.

పాదయాత్ర చేస్తున్న కందుల నారాయణరెడ్డి

పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు రెండవ సొరంగం ఓ దశలో లేకుండా ప్రాజెక్టు డిజైన్ చేశారు. ఒకే సొరంగ మార్గం ద్వారా వెలిగొండ ప్రాజెక్టులో 48 టిఎంసిల నీటిని నింపడం సకాలంలో సాధ్యం కాదు. రెండవ సొరంగం అవసరమని గతంలో సిపిఎం పోరాడింది. 2006లో కందుల నారాయణరెడ్డి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పాదయాత్ర చేపట్టారు. గ్రామాల్లో రైతుల్లో చైతన్యం తీసుకువచ్చారు. పెద్ద ఎత్తున ఉద్యమం సాగింది. ఎట్టకేలకూ రెండవ సొరంగ మార్గాన్ని ప్రభుత్వం మొదలు పెట్టింది. ఆ క్రేజ్‌తో కందుల నారాయణరెడ్డి 2009లో మార్కాపురం ఎమ్మెల్యేగా గెలుపొందారు. వచ్చే ఎన్నికల్లోనూ నెగ్గేందుకు కందుల నారాయణరెడ్డి మరోసారి పాదయాత్రికుడిగా ప్రజల వద్దకు బయలుదేరాడు.

పశ్చిమ ప్రకాశం ఆశాజ్యోతి వెలిగొండ ప్రాజెక్టు అని చెప్పాలి. అంతటి ప్రాధాన్యత కలిగిన అంశాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏడాదిలో వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నాలుగేళ్లు దాటినా వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి కాలేదు. వెలిగొండ నిర్వాసితుల ప్యాకేజి ఎప్పుడిస్తారో తెలియన పరిస్థితి ఉంది. ఇటీవల బడ్జెట్‌లో వెలిగొండ కేసం కేవలం రూ. 101 కోట్లు మాత్రమే కేటాయించారు. ఆ నిధులు కరెంటు బిల్లుకు సరిపోవు. వెలిగొండ ప్రాజెక్టుపై వైసిపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని టిడిపి నేతలు ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంత ప్రజల్లో కూడా వెలిగొండపై నమ్మకం సన్నగిల్లుతోంది. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి చీమకుర్తి బహిరంగ సభలో వెలిగొండను జాతికి అంకితం చేసిన తరువాతనే ఓట్లు అడుగుతామని గట్టి హామీ ఇచ్చారు. ఇప్పటి కేటాయింపులను బట్టిచూస్తే ఆ హామీ ఓటిదిగా మిగులనుంది. వెలిగొండ పనులు పూర్తి చేసేందుకు, నిర్వాసితులను ప్యాకేజితో పునరావాస కాలనీలకు సాగనంపేందుకు రూ. 1500 కోట్లకు పైగా అవసరమని అధికారులు అంటున్నారు. ఈ బడ్జెట్‌లో కేటాయించింది నామమాత్రమే.

టిడిపి వెలిగొండ ప్రాజెక్టుకు జరుగుతున్న అన్యాయంపై ప్రజల్లోకి వెళ్లి బలం పెంచుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఇటీవల ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో వైసిపి పరాజయం పాలైంది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ వైసిపి ఎమ్మెల్యేలతో ఓట్లు వేయించుకోలేక పోయారని ప్రజల్లో వాదనలు వినిపిస్తున్నాయి. ప్రజల్లోనూ, అధికార పార్టీ ఎమ్మెల్యేల్లోనూ సిఎం జగన్ వ్యవహారశైలి పట్ల వ్యతిరేకత ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో టిడిపిలో జోష్ పెరిగింది. ఎమ్మెల్సీ ఎన్నికల తరువాత పరిస్థితులను టిడిపి అనుకూలంగా మలుచుకుంటోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు ఏడాది మాత్రమే సమయం ఉంది. ఈ కొద్ది సమయంలో ప్రజల్లో ఏదొక సమస్యపై తిరుగుతుంటే జనం దగ్గరవుతారని, వైసిపి వైఫల్యాలను వివరిస్తూ ఓట్ల బలనాన్ని పెంచుకోవచ్చని కందుల నారాయణరెడ్డి మరోసారి పాదయాత్ర చేపట్టారు.

మార్కాపురం ప్రత్యేక జిల్లా కోసం కందుల నారాయణరెడ్డి తీవ్ర స్థాయిలో ఉద్యమాన్ని నడిపారు. జిల్లా ఉద్యమంలో భాగంగా ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి కందుల ప్రజల్లో సానుభూతి పొందారు. అర్హత కలిగిన మార్కాపురం జిల్లా చేయకపోవడంపై ఈ ప్రాంత ప్రజల్లో సిఎం జగన్‌పై అసంతృప్తి ఉంది. టిడిపి అధికారంలోకి వస్తే మార్కాపురం జిల్లా ఏర్పాటు తథ్యమని ఆ పార్టీ అధినేత చంద్రబాబుతో ఈ పాటికే కందుల నారాయణరెడ్డి ప్రకటింపజేశారు. వెలిగొండ, మార్కాపురం జిల్లా అంశాలతో ప్రజలకు మరింత చేరువ కావాలని, వచ్చే ఎన్నికల్లో ప్రత్యర్థి ఎవరైనా మార్కాపురం నియోజకవర్గంలో విజయం సాధించేలా కందుల నారా యణరెడ్డి ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకుంటున్నారని అర్థమవుతోంది.!

అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-వెలిగండ్ల

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను టిడిపి నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, నియోజకవర్గ బిసిసెల్ అధ్యక్షుడు కాసునూరి మౌలాలి, తెలుగు యువత మండల అధ్యక్షుడు కర్నాటి భాస్కర్‌రెడ్డి, ఎస్‌సి సెల్ మండల అధ్యక్షుడు గోనా వెంగటయ్య, టిడిపి గ్రామ అధ్యక్షుడు చందా కాశీరెడ్డి, ఐటిడిపి మండల కన్వీనర్ గోనా దేవా తదితరులు పాల్గొన్నారు. **యర్రగొండపాలెం :** టిడిపి పట్టణ అధ్యక్షుడు మస్తాన్ వలి ఆధ్వర్యంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కామేపల్లి వెంకటేశ్వర్లు, మూడవత్ మంత్రునాయక్, వేగినాటి శ్రీనివాస్, కంచర్ల సత్యనారాయణ గౌడ్, శనగా నారాయణ రెడ్డి, కాకర్ల కోటయ్య, చిట్యాల వెంగళ రెడ్డి, కొత్త బాస్కర్, దొంతా వెంకట్రావు గౌడ్, పాలడుగు కోటయ్య, శేవ్యా నాయక్, గురిజేపల్లి జిలాని, చేదూరి గంగయ్య, చేదూరి కిషోర్, కిషోర్ సింగ్, షేక్ ఇస్మాయిల్, షేక్ రఫీ, కందుల నారాయణ రెడ్డి, మురారిపల్లి సుబ్బారెడ్డి, కైపు వెంకటరెడ్డి, వెన్నా వెంకిరెడ్డి, కూచిపూడి కోటయ్య, తోట ఆనంద్, నాగరాజు చలమయ్య, గంజివారిపల్లి చంటి, వెంకట నారాయణ, చేదూరి లక్ష్మయ్య, చేకూరి నాగరాజు పాల్గొన్నారు. **హనుమంతునిపాడు :** టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరపు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు టిడిపి మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కటింగ్ చేసి అచ్చెన్నాయుడు, చంద్రమోహన్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మురహరి నరసయ్య, గాయం రామిరెడ్డి, కందుల వెంకటసుబ్బారెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, కోటపాటి శేషయ్య, శ్యామల వెంకటేశ్వర్లు, కాటేపల్లి ఆవులయ్య, గుమ్మ కొండయ్య, దోసపాటి రమణయ్య, దశరథ కుప్పయ్య, కొండపురెడ్డి రమణారెడ్డి, గంటా గురవారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, చిన్నపురెడ్డి, తిరుపతిరెడ్డి, బాల వెంకటేశ్వరరెడ్డి, చెన్నయ్య, కేశవ, సుధాకర్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, వెంకటనారాయణరెడ్డి, బ్రహ్మారెడ్డి బాబు, వెంకటరెడ్డి, అశోక్ పాల్గొన్నారు. **పామూరు :** టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు , మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలను టిడిపి పట్టణ అధ్యక్షుడు షేక్ ఖాజా రహంతుల్లా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్నేని రామకష్ణ, ఇర్రి శివారెడ్డి, చల్లా కిషోర్, కోటపాటి రాము, ఫత్తు మస్తాన్ తదితరులు పాల్గొన్నారు. **దర్శి :** టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రశేఖరరెడ్డి పుట్టినరోజు సందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నగరపంచాయతీ చైర్మన్ నారపశెట్టి పిచ్చయ్య, టిడిపి మండల అధ్యక్షుడు చిట్టే వెంకటేశ్వర్లు, తెలుగు మహిళా అధికార ప్రతినిధి శోభారాణి, నాయకులు మారెళ్ల వెంకటేశ్వర్లు, సందు రామయ్య, రామగిరి, దినకర్, జాలయ్య, శ్రీనివాసరావు, కొండలు, వలి, సైదా తదితరులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడులో కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

అన్నదానం చేస్తున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

అన్నదానం

గిద్దలూరు రూరల్ : రాచర్ల మండలం అకవీడు గ్రామంలో శ్రీమహాగణపతి కుమార స్వామి భద్రకాళి సమేత వీర భద్రుడు నందీశ్వరుడు, నవగ్రహ, నాగదేవత, ధ్వజస్తంభ, ఆలయ గోపుర కలశం, విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పిడతల రాంభూపాల్‌రెడ్డి తనయుడు, వైసిపి నాయకుడు పిడతల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కుటుంబసమేతంగా అమ్మవారి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించిన పిడతల ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిపి శంకర్‌రెడ్డి, సర్పంచి దేవదానం, బాల రంగయ్య, శేఖర్ పాల్గొన్నారు.

టిడిపిలో చేరిక

గిద్దలూరు : కంభం మండలం, చిన్న కంభం పంచాయతీ పరిధిలోని దేవనగరం గ్రామానికి చెందిన 13 కుటుంబాల వారు టిడిపిలో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి కండవాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. టిడిపిలో చేరిన వారిలో లక్కు రంగయ్య, ఆల్వార్, ప్రశాంత్, వినోద్, ప్రభాకర్, లక్ష్మయ్య, అశోక్ కుమార్, అడపాల కొండల్, నవీన్, లక్ష్మయ్య, రాజేష్ ఉన్నారు.

పాదయాత్రకు అనూహ్య స్పందన

- 60 శాతం మందికిపైగా వైసిపి ఎమ్మెల్యేల్లో అసంతృప్తి
- శాసనసభ్యులు స్వామి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

రాష్ట్రాభివృద్ధి టిడిపికే సాధ్యమని కొండపి శాసనసభ్యులు డాక్టర్ బాలవీరాంజనేయస్వామి అన్నారు. ఆదివారం మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి చేపట్టిన ప్రజాచైతన్య పాదయాత్రకు ముఖ్యఅతిథిగా శాసనసభ్యులు స్వామి పాల్గొన్నారు. తొలుత స్వామి, మాజీ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డిలు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెలుగొండ స్వామి దేవాలయంలో అర్చకులు నంద్యాల వెంకటాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కొండపి శాసనసభ్యులు డోలా బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ వైసిపి ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యవంతం చేసేందుకు పాదయాత్ర దోహదపడుతుందని అన్నారు. రాష్ట్రంలో రాక్షసపాలన సాగుతోందని, చమరగీతం పాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుతం వైసిపి శాసనసభ్యులల్లో 60శాతం పైగా అసంతృప్తిగా ఉన్నారని, ఇప్పుడు ఎన్నికలు జరిగితే వైసిపిని చిత్తుచిత్తుగా ప్రజలు ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రజలకు మెరుగైన సంక్షేమం అందించాలంటే టిడిపికే ఓటు వేయాలని కోరారు. వెలుగొండ ప్రాజెక్టును ప్రారంభించి 18 సంవత్సరాలు కావస్తుందని, మిగిలిన పనులు

పాదయాత్ర నిర్వహిస్తున్న మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, చిత్రంలో కొండపి ఎమ్మెల్యే స్వామి

సంవత్సరంలో పూర్తి చేస్తానన్న సిఎం జగన్మోహన్‌రెడ్డి రూ.350 కోట్లు అవసరం కాగా బడ్జెట్‌లో రూ.101 కోట్లు కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. ఆ నిధులు నిర్వాసితులకు, సిబ్బందికి కూడా సరిపోవని ఎద్దేవా చేశారు. శాసన మండలి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులను దేవుడి స్క్రిప్ట్ ప్రకారమే గెలిపించారన్నారు. మాజీ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ వెనుకబడిన పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే వెలుగొండ ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించాలని, మార్కాపురాన్ని జిల్లా కేంద్రంగా తక్షణమే ప్రకటించాలన్నారు. బడ్జెట్‌లో కేటాయించిన రూ.100 కోట్లు భూముల నిర్వాసితులకే సరిపోవని, వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసి నీళ్ళు ఎలా ఇస్తారో చెప్పాలని పేర్కొన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన రెండేళ్లల్లో వెలుగొండ పూర్తి చేసి నీళ్ళు ఇస్తామని, నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష మేరకు మార్కాపురం జిల్లా కేంద్రంగా ప్రకటిస్తామని పాదయాత్రలో హామీ ఇచ్చారు. వెలుగొండ నుంచి ప్రారంభమైన ప్రజాచైతన్య యాత్ర గార్లదిన్నె, నాగిరెడ్డిపల్లి, వద్దిమడుగు వరకు సాగింది. ఈ కార్యక్రమంలో కొండపి శాసనసభ్యులు డోలా వీరాంజనేయస్వామి, పొదిలి ఎఎంసి మాజీ ఛైర్మన్ చప్పిడి రామలింగయ్య, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కామసాని రామిరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ మోరబోయిన బాబూరావు, వెలుగొండ ఆలయ మాజీ ఛైర్మన్ కుందురు కాశిరెడ్డి, బిసి సెల్ నాయకులు అంకాల రోశయ్య, నాయకులు గునుపూడి భాస్కర్, స్వర్ణగీత, వరికూటి వెంకటరామిరెడ్డి, కనకం నరిసింహారావు, చిన్నబాబు, కంచర్ల కాశయ్య, తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కందెర నాసరయ్య, సుఖదేవ్, సుబ్బయ్య, కోనంకి సాల్మన్, బాషాపతినాయుడు, బీమాంజనేయరెడ్డి, మీగడ ఓబుల్‌రెడ్డి, శామంతపూడి నాగేశ్వరరావు, కాటంరాజు, శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్‌చేసి తినిపించుకుంటున్న టిడిపి నాయకులు

అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-సంతనూతల పాడురూరల్

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు జన్మదినం సందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన జన్మదిన వేడుకలను నిర్వహించారు. ముందుగా పుట్టినరోజు కేకును కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు మద్దినేని హరిబాబు గ్రామ పార్టీ అధ్యక్షుడు బొడ్డు శంకర్, టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వివరం గోవిందయ్య బాపట్ల పార్లమెంట్ ఎస్సీ సెల్ కార్యదర్శి రంపతోటి అంకారావు బాపట్ల పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావు, టిఎన్‌టియుసి ఆర్గనైజింగ్ సెక్రటరీ పి నారాయణస్వామి చౌదరి, టిఎన్‌టియుసి మండల అధ్యక్షుడు మందాడి వెంకటేశ్వర్లు, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు ఎన్ మాధవీలత, నాయకులు ముప్పరాజు శ్రీనివాసరావు, చిట్టెంశెట్టి శ్రీనివాసరావు, దావులూరి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ గౌతమి

ఉప్పుగుండూరులో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని ఉప్పుగుండూరులో స్టార్ ఫౌండేషన్, హైదరాబాద్ వారి సౌజన్యంతో, రెండో విడత షుగరు, బీపీ వ్యాధులకు ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. పై వ్యాధులకు సంబంధించిన రక్త పరీక్షలు నిర్వహించి, వైద్యులు సూచించిన ప్రకారం ఒక నెలకు సరిపడా మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ సానల ధీరజ్ బాబు ఎండి (జనరల్ మెడిసిన్), డాక్టర్ ఆర్ గౌతమిలు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ధీరజ్‌బాబు మాట్లాడుతూ, షుగరు, బీపీ వ్యాధులకు నివారణ లేదని, నియంత్రణ మాత్రమే సాధ్యమని అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ వ్యాధుల పట్ల అవగాహన పెంచుకోవాలని, లేనియెడల అనేక వ్యాధులకు ఆస్కారం వుంటుందని అన్నారు. శారీరక శ్రమ, ఆహార నియమాలు, మందు బిళ్లలు, అప్రమత్తత అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టార్ ఫౌండేషన్ నిర్వహకులు శ్రీ సూరి కోటా రెడ్డి దంపతులు, తన్మయిరెడ్డి ఈ కార్యక్రమ కో-ఆర్డినేటర్ కెఎల్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'ఎర్త్ అవర్'పై అవగాహన అవసరం

డాక్టర్ బాబూరావు

ప్రజాశక్తి-చీరాల

ఎర్త్ అవర్ ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించే వాతావరణ దినోత్సవం అని, గ్లోబల్ వార్మింగ్ కారణంగా జీవరాశి ఉనికి ప్రశ్నార్థకంగా మారినందున భూమిని కాపాడుకుందామని రోటరీ క్లబ్ చీరాల అధ్యక్షుడు డాక్టర్ ఐ బాబూరావు అన్నారు. ప్రపంచవ్యాప్తంగా పాటించే ఎర్త్ అవర్‌ని పురస్కరించుకొని స్థానిక సాయి ప్యాలెస్ రోడ్‌లోని ఆనంద నిలయం సంక్షేమ వసతి గృహంలో విద్యార్థినులతో ఎర్త్ అవర్ కార్యక్రమాన్ని రోటరీ క్లబ్ చీరాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబూరావు మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించుకుందామనే అంటూ పర్యావరణవేత్తలు ఎర్త్ అవర్‌కు శ్రీకారం చుట్టారని అన్నారు. ఎర్త్ అవర్ అంటే ఓ గంట పాటు విద్యుత్ వినియోగాన్ని ఆపేయడమే కాదని మనం నివసించే భూమిని కాపాడుకునే

విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ బాబురావు

ఆలోచనలకు శ్రీకారం చుట్టడం అని అన్నారు. కరెంట్ బల్బులు, టీవీలు, కంప్యూటర్లు వగైరా కరెంటుతో నడిచే ఉపకరణాలన్నీ కాసేపు స్విచ్ ఆఫ్ చేయడం ద్వారా ఇలా విద్యుత్ ఆదా చేస్తే ఆ మేరకు భూ వాతావరణాన్ని పరిరక్షించినట్లేనని అన్నారు. 2007వ సంవత్సరంలో ఆస్ట్రేలియాలోని సిడ్నీలో దీన్ని మొదలు పెట్టారని అన్నారు. ప్రతి సంవత్సరం సాధారణంగా మార్చి మాసంలోని చివరి శనివారం రాత్రిపూట ఒక గంట విద్యుత్ ఉపకరణాలు అన్నింటినీ ఆపివేయటం ద్వారా ప్రపంచవ్యాప్తంగా దీనిని జరుపుకుంటూ ఇప్పటికీ ప్రజలు స్వచ్ఛందంగా ఎర్త్ అవర్ పాటించే విధంగా చైతన్యం తీసుకురాగలిగారన్నారు. అనంతరం విద్యుత్ పరికరాల ఆపివేసి కొవ్వొత్తులతో మానవహారం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ కోసం పోరాడుతున్న ప్రతి ఒక్కరికీ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో నేషనల్ గ్రీన్ కోర్ బాపట్ల జిల్లాకు ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, గీతా యంగ్ సైంటిస్ట్ అధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ సంక్షేమ వసతి గృహాల వార్డెన్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి డ్వాక్రా మహిళలకు ఆసరా పథకం కింద దెందులూరులో నగదు జమ చేయటం పట్ల ఆదివారం పెదపులివర్రు గ్రామంలో ఆయన చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంపిపి డివి లలితకుమారి మాట్లాడుతూ మండలంలో 1008 డ్వాక్రా గ్రూపులకు 11 కోట్ల రూపాయలు మహిళల ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకొని మహిళలను ఆర్థికంగా ముందుకు నడిపిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగమల్లేశ్వరరావు, ఆయా గ్రూపు సభ్యులు ఉన్నారు.

అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

మద్దిపాడులో అన్నదానం

ప్రజాశక్తి-మద్దిపాడు

ఏలూరి హనుమంతాచారి జ్ఞాపకర్థం వారి ఆర్థిక సహాయంతో మణికంఠచారి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ వారు స్థానిక బ్రాహ్మం గారి చెట్టు వద్ద ఆదివారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అనేక మంది అన్నదానాన్ని వినియోగించుకున్నారు.

వలస వెళుతున్న ఆవులు

గ్రాసం కోసం ఆవుల వలస

ప్రజాశక్తి-సంతమాగులూరు

ప్రకాశం జిల్లా, పుల్లలచెరువు మండలం, సుగాలీల తండాల నుంచి ఆవులు పశు గ్రాసం కోసం, వినుకొండ, సంతమాగులూరు, కోటప్పకొండ, చిలకలూరిపేట మీదుగా గుంటూరు జిల్లా తెనాలి వైపు తరలి వెళుతున్నాయి. పుల్లలచెరువు సమీపంలోని అడవులలో వేసవికాలంలో పశు గ్రాసం దొరకనందున, తెనాలి ప్రాంతం వైపు ఉన్న మాగాణి భూములలో ఆవులను మేత మేపుకునేందుకు వెళుతున్నట్లు ఆవుల పెంపకందారులైన సుగాలీలు తెలుపుతున్నారు. ఈ ఆవుల వెంట ఎడ్లబండ్లతో సుగాలీల కుటుంబాలు తరలి వెళుతున్నాయి. ఈ ఏడాది 20 వేల ఆవుల వరకు తెనాలి వైపు వలస వెళ్లినట్లు సుగాలీలు తెలుపుతున్నారు. మళ్లీ తొలకరిలో జూలై నెలలో తిరిగి స్వగ్రామాలకు ఆవులు చేరుకుంటాయని వారు చెప్పారు.

ఆత్మవిశ్వాసమే లక్ష్యంగా స్టెప్ నిర్విరామ కృషి

ప్రజాశక్తి-మార్టూరు రూరల్ : సమాజంలో ఆత్మన్యూనతా, అభద్రతా భావాలను అన్ని వర్గాల నుంచి దూరం చేయటం కోసం స్టెప్ సంస్థ నిర్విరామ కృషి చేస్తోందని ప్రముఖ సైకాలజిస్ట్, వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు అన్నారు. ఆదివారం మార్టూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఎడ్యుకేటర్స్, తల్లితండ్రులు లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా స్టెప్ జాతీయ సమితి ఆధ్వర్యంలో ఉచిత వక్త శిక్షణ కార్యక్రామాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. నేటి సమాజంలో విద్యార్థులు, యువతతో పాటు అన్ని రంగాల్లో ఒత్తిడి అనివార్యమై ఆత్మహత్యలు పెరగటం, తీసుకున్న లక్ష్యాలను చేరుకోలేక పోవటం ఆందోళన కలిగిస్తోందని అన్నారు.

శివనాగిరెడ్డికి అభినందనలు

శివనాగిరెడ్డిని అభినందిస్తున్న ఎంపీ మాగుంట

ప్రజాశక్తి-పంగులూరు

అస్సాం రాష్ట్రంలోని గౌహతి పట్టణంలోని తరుల్ పుర స్టేడియంలో ఈ నెల 20 నుంచి 24 వరకూ అంతర్జాతీయ నాల్గవ ఏషియన్ ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో భారత్ పురుషుల జట్టు బంగారు పతకం సాధించింది. భారతదేశం తరపున ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి, ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని జె.పంగులూరు ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ క్రీడాకారుడు అట్ల శివనాగిరెడ్డి పోటీలో పాల్గొని జట్టుకు బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా శివనాగిరెడ్డిని, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ బాచిన చెంచు గరటయ్య, మాగుంట కళాశాలల చైర్మన్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, శాప్ నెట్ చైర్మన్ బాచిన కృష్ణ చైతన్య, రాష్ట్ర అసోసియేషన్ చీఫ్ పాట్రన్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, శిక్షకుడు రాష్ట్ర ఖోఖో కార్యదర్శి, మేకల సీతా రామిరెడ్డి తదితరులు అభినందించారు. జిల్లా రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ వి. సిఎండి హర్షవర్ధన్, జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు భాస్కరరావు, కాశీ విశ్వనాథరెడ్డి, రాష్ట్ర ఖోఖో అధ్యక్షుడు ప్రసాద్, రాష్ట్ర సంఘ సభ్యులు, పంగులూరు గ్రామ సర్పంచి గుడిపూడి నాగేంద్రమ్మ, జడ్పిటిసి రాయిని ప్రమీల, ఎంపిటిసి నూతలపాటి రాములు, రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు బాధ్యులు చిలుకూరి వీరరాఘవయ్య, కరణం హనుమంతరావు తదితరులు శివనాగిరెడ్డిని అభినందించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

జడ్పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

ప్రజాశక్తి-చీమకుర్తి

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నట్లు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. మండల పరిధిలోని బూదవాడ,యల్లయ్యనగర్ గ్రామాల్లో ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకరబాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డితో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ రాష్ట్రం అన్ని రంగాలలో సర్వతోముఖాభివృద్ధి చెందిందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి సారధ్యంలో రాష్ట్రం ముందుకు వెళుతుందన్నారు. రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి వేమా శ్రీనివాస రావు, వైసిపి మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, సర్పంచి జంగ్రాజుపల్లి మరియమ్మ, ఉపసర్పంచి మేదరమెట్ల శ్రీనివాసులు, మాజీ ఎంపిపి మేదరమెట్ల ఈశ్వరమ్మ, వైసిపి నాయకులు గంగిరెడ్డి ఓబులరెడ్డి, ఎంపిటిసి చిన్నపురెడ్డి వెంకటరెడ్డి, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, పులి వెంకటరెడ్డి, మాజీ ఎంపిటిసి గూడూరు ఆంజనేయులు, గోగినేని తిరుపాలు,జి చంద్ర,సూది శ్రీను, జె.యాకోబు పాల్గొన్నారు.

ఉపాధిహామీ చట్టానికి

నిధుల కోతను నిరసిస్తూ దేశవ్యాప్త ఉద్యమం

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు జాలా అంజయ్య

మాట్లాడుతున్న జాలా అంజయ్య

ప్రజాశక్తి-పామూరు

బడ్జెట్‌లో ఉపాధి హామీ చట్టానికి నిధుల కోత నిరసిస్తూ దేశవ్యాప్త ఉద్యమాన్ని నిర్వహించున్నట్లు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు జాలా అంజయ్య తెలిపారు. స్థానిక పప్పు వెంకోబురావు మీటింగ్ హాలులో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం చల్లా వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాలా అంజయ్య మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్‌లో లక్ష కోట్లు కేటాయించాలని, ప్రతి కూలికి 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజువారీ వేతనం రూ.600 ఇవ్వాలని, సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ చట్టం కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిహెచ్. వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్యదర్శి మండల కార్యదర్శి వైవి. నారాయణ, శివరామయ్య, ఇశ్రాయేలు, కోటేష్, ఖాదర్‌బి, అల్లాభక్షు, మహదేవయ్య, ఖాసి సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సురేష్‌కు తప్పిన ప్రమాదం

పారా గ్లైండింగ్‌కు సిద్ధమవుతున్న మంత్రి సురేష్

ప్రజాశక్తి- యర్రగొండపాలెం

రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌కు ఆదివారం తృటిలో ప్రమాదం తప్పింది. విశాఖపట్నం ఆర్కే బీచ్‌లో పారా గ్లైడింగ్ చేస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. పారా గ్లైడర్ టేకాఫ్ అయ్యే సమయంలో ఇంజన్ ఒక్క సారిగా పక్కకు ఒరిగిపోయింది. ఆ సమయంలో పారా గ్లైడర్‌లో మంత్రి, పైలెట్ ఉన్నారు. పారా గ్లైడర్ పక్కకు పడే సమయంలో స్థానికులు పట్టుకోవడంతో ప్రమాదం తప్పింది. ఆర్‌కే బీచ్‌లో జీ 20 సదస్సు సన్నాహక భాగంగా మారథాన్, సాహస క్రీడలను మంత్రులు ఆదిమూలపు సురేష్, విడదల రజని, గుడివాడ అమర్నాథ్ ప్రారంభించారు. నిర్వాహకుల ఆహ్వానం మేరకు మంత్రి సురేష్ పారా గ్లైడింగ్ ఫస్ట్ రైడ్‌కు వెళ్లేందుకు ఉత్సాహం చూపారు. విండ్ డైరెక్షన్ సహకరించకపోవడంతో వెహికల్ కుదుపులకు గురై ఇసుక తిన్నెలో ఒరిగిపోయింది. ఈ నెల 28 నుంచి మూడు రోజుల పాటు విశాఖపట్నం వేదికగా జీ-20 సన్నాహక సదస్సు జరగనుంది. అందుకు సంబంధించిన ఏర్పాట్లపై మంత్రులు విడదల రజని, ఆదిమూలపు సురేష్, గుడివాడ అమర్‌నాథ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సదస్సుకు సిఎం జగన్ హాజరు కానున్నారు. అదేవిధంగా దేశ, విదేశాలనుంచి అతిథులు హాజరుకానున్నారు.

జిల్లా పారిశ్రామికాభివృద్ధికి కృషి

- నూతన పరిశ్రమల ఏర్పాటుకు అనుమతి
- పరిశ్రమల శాఖ ద్వారా పిఎంఇజిపి పథకం
- జిల్లా పరిశ్రమల శాఖ అధికారి మదన్ మోహన్ శెట్టి

ముఖాముఖి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా ప్రారిశ్రామికంగా అభివృద్ధి చెందేలా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఎన్. మదన్ మోహన్ శెట్టి తెలిపారు. జిల్లా ఆర్థికాభివద్ధి కోసం బ్యాంకర్ల ఆర్థిక చేయూతతో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు తోడ్పాటునందిస్తూ పలు పరిశ్రమల ఏర్పాటుకు తమ వంతు కృషిచేస్తున్నట్లు ఆయన చెప్పారు. జిల్లాలో వ్యవసాయ ఆధారిత కంపెనీల ఏర్పాటుకు మార్గం సుగమం చేస్తూ పలు రకాల పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా తయారీ రంగం, సేవారంగాల్లో పలు పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు ఇస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో పరిశ్రమల శాఖ ద్వారా చేపట్టిన పలు ప్రాజెక్టుల గురించి జిల్లా అధికారి మదన్ మోహన్ శెట్టి ప్రజాశక్తి ముఖాముఖికి వివరించారు. అవన్నీ ఆయన మాట్లల్లోనే...

నూతన పరిశ్రమల ఏర్పాటుకు అనుమతి

పారిశ్రామిక వాడగా బాపట్ల జిల్లాను మార్చడానికి తీసుకుంటున్న చర్యల్లో భాగంగా చీరాల ఆటోనగర్లో పలు రకాల పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు ఇస్తున్నాం. ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో 10 సూక్ష్మ పరిశ్రమల స్థాపనకు ఆమోదం తెలిపాం. సింగిల్ డెస్క్ పోర్టల్లో వచ్చిన 230 దరఖాస్తులను పరిశీలించి 218 యూనిట్ల స్థాపనకు అనుమతులు ఇచ్చాం. అద్దంకి వద్ద రూ.11 కోట్లతో మెటల్ డోర్స్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసే అంశంపై చర్చించాం. ఇది ఏర్పాటైతే బాపట్ల జిల్లాలోనే మెటల్ డోర్స్ తయారు అవుతాయి. వేమూరు మండలం జంపని గ్రామంలో భారత్ టెక్స్ టైల్స్ క్లస్టర్ అసోసియేషన్ ద్వారా రూ.10 కోట్ల అంచనాలతో అరిటి బోదెలు, పట్టుపురుగుల వ్యర్థాలతో వస్త్రాల తయారీ కేంద్రం ఏర్పాటుపై చర్చించాం. సంబంధిత ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు కావాల్సిన భూమి కేటాయింపుల ప్రతిపాదనలను పరిశీలిస్తున్నాం. జిల్లాలో కాలుష్యం లేని కంపెనీల ఏర్పాటు కోసం రూ.15 కోట్లతో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ భవన నిర్మాణ ప్రతిపాదనలు ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి చేయూతతో ఈ ప్రాజెక్టు నెలకొల్పాల్సిఉంది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పార్క్ ఏర్పాటు కోసం బాపట్ల, రేపల్లె, చీరాలలో 25 ఎకరాల భూమి కేటాయింపుల కోసం సంబంధిత అధికారులకు నివేదికలు పంపనున్నాం. జిల్లా లోని మేదరమెట్ల వద్ద రూ.225 కోట్ల అంచనాలతో ఎథనాల్ తయారీ పరిశ్రమ ఏర్పాటుకు శర్వాణి బయెఫ్యూయెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ రాష్ట్రప్రభుత్వంతో ఎంఒయు కుదుర్చుకుంది.

పరిశ్రమల శాఖ ద్వారా పిఎంఇజిపి పథకం

పిఎంఇజిపి పథకం ద్వారా జిల్లాలో పలు యూనిట్ల ఏర్పాటుకు రుణాలు ఇస్తున్నారు. తయారీ రంగంలోప్రాజెక్టు వ్యయం రూ.50 లక్షల వరకూ అనుమతి ఉంది.18 సంవత్సరాలు నిండిన వారు అర్హులు. ఆపై వయోపరిమితి లేదు. రూ 10 లక్షలపైన ప్రాజెక్టు ఏర్పాటుకు కనీసం 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. సిమెంట్,ఫ్లైయాష్ బ్రిక్స్, సిమెంట్ డోర్లు,పార్కింగ్ టైల్స్,రైస్ మిల్లులు,డాల్ మిల్లులు,జీడిపప్పు ప్రాసెసింగ్,వ్యవసాయ మరియు ఆహార ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు రుణం ఇస్తారు. సేవారంగంలో రూ.20 లక్షల వరకు రుణం ఇస్తారు. సెంట్రింగ్ మెటీరియల్, డిజె సౌండ్ సిస్టమ్, టెంట్ హౌస్‌లు, ఎయిర్ కంప్రెసర్లు, లేడీస్ బ్యూటీపార్లర్ ఏర్పాటుకు రుణాలు ఇస్తారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మహిళలు ప్రాజెక్టు వ్యయంలో 5 శాతం రుణాన్ని భరించాలి. ప్రాజెక్టు వ్యయంలో 95 శాతం రుణంగా ఇస్తారు. ఇతరులు ప్రాజెక్టు వ్యయంలో 10 శాతం భరించాలి. ప్రాజెక్టు వ్యయంలో 90 శాతం వరకు రుణం ఇస్తారు.

ఎపి ఎంఎస్ఎమ్ ఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా పరిశ్రమలు మంజూరు

సూక్ష మరియు చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌళిక సదుపాయాలను అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన యంత్ర సామగ్రిని,సాంకేతిక పరిజ్ఞానం మరియు నైపుణ్యాలను అందుబాటులోకి తెచ్చి ఉత్పత్తులను పెంచడంతో పాటు స్థానికులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపరచేందుకు రాష్ట్రప్రభుత్వం ఎపి ఎంఎస్ఎంఇ డెవలప్‌మెంట్ కార్పోరేషన్‌ను ఏర్పాటు చేసింది.ఈ సంస్థ ద్వారా క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్,ర్యాంప్ ప్రోగ్రామ్‌లను అమలు చేస్తారు.కోవిడ్ కారణంగా దెబ్బతిన్న పరిశ్రమలను తిరిగి నిలదొక్కుకునేలా వారికి సహకరించడం కోసం, మార్కెట్ అవకాశాలు పెంపుదల కోసం,స్త్రీల భాగస్వామ్యాన్ని పెంచడం, ఎస్‌సి,ఎటి పారిశ్రామికవేత్తలను అభివృద్ధి కోసం దీన్ని ఏర్పాటు చేశారు. దీని ద్వారా రూ.5 కోట్ల నుంచి రూ. 10 కోట్ల విలువైన ప్రాజెక్టులను ఒక కేటగిరిగా రూ. 10 నుంచి రూ. 30 కోట్ల విలువైన ప్రాజెక్టులను మరొక కేటగిరిగా చేసి రుణాలు ఇస్తారు. కేంద్ర ప్రభుత్వ వాటాతో ఈ ప్రాజెక్టులు మంజూరు చేస్తారు. రూ.10 కోట్ల లోపు ప్రాజెక్టు కోసం 10 సూక్ష్మ మరియు చిన్న తరహ పరిశ్రమలు ఒక క్లస్టర్‌గా ఏర్పడాలి.సేవారంగంలో కూడా ప్రాజెక్టులు మంజూరు చేస్తారు. వైద్యరంగంలో అధునాతన యంత్రపరికరాలు,పరిజ్ఞానం కోసం చీరాలలో ఓ ప్రాజెక్టును మంజూరు చేయనున్నారు.